SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక


**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 19 | సంచిక: 193 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 22 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

# సంక్షోభ ప్రభావాలపై కేంద్ర కేబినెట్ కీలక చర్చ



11 నెలల తర్వాత మోదీ అధ్యక్షతన కీలక సమావేశం

చమురు ధరలు, ఆర్థిక ప్రభావాలపై సమీక్ష

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన గురువారం సాయంత్రం కేంద్ర మంత్రిమండలి కీలక సమావేశం జరిగింది. దాదాపు 11 నెలల తర్వాత నిర్వహించిన ఈ కేబినెట్ సమావేశంలో దేశంలోని ప్రస్తుత పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం.

4



4

# ఎబోలా వైరస్ విజృంభణ

ఇండియా-ఆఫ్రికా సమిట్ వాయిదా .. కేంద్రం ముందు జాగ్రత్తలు

# సరస్వతీ నమస్తుభ్యం

ఘనంగా సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభం

- కంచి పీఠాధిపతి రాక
- పుణ్యస్నానాలు చేసిన మంత్రులు



త్రివేణి సంగమ క్షేత్రమైన కాళేశ్వర తీరంలో ఆధ్యాత్మిక పండుగ వాతావరణం సంతరించుకుంది. దేశంలోనే అత్యంత పవిత్రమైనదిగా భావించే సరస్వతీ నది అంత్య పుష్కరాలు గురువారం ఉదయం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి సమక్షంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఈ పుష్కర వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి, అధికారికంగా అంత్య పుష్కరాలను నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

2లో

# జర్నలిస్టులకు ఆర్థిక సాయం

21 మందికి మంజూరు చేసినట్లు వెల్లడి





# కార్మికులకు శుభవార్త

## కనీస వేతనాలు అమలుకు నిర్ణయం



- కేబినెట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం
- లబ్ధిపొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు
- బండి తనయుడు భగీరథను పోలీసులే అరెస్ట్ చేశారు
- కేటీఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నాడన్న భ్రమలో ఉన్నారు
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

2

తెలంగాణలోని కోట్లాది మంది కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక తీపి కబురు అందించింది. శ్రమజీవుల చిరకాల డిమాండ్‌ను నెరవేరుస్తూ రాష్ట్రంలో కనీస వేతనాలను భారీగా సవరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం, కాలయాపన వల్ల రాష్ట్రంలో దాదాపు 1.11 కోట్ల మంది కార్మికులు దశాబ్ద కాలంగా తీవ్రంగా నష్టపోయారని, అందుకే తాము అధికారంలోకి రాగానే ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి సభ్యులుగా కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. వివిధ కార్మిక సంఘాలు, యాజమాన్యాలు, భాగస్వామ్య పక్షాలతో ఈ కమిటీ జరిపిన సుదీర్ఘ చర్చల అనంతరం ఇచ్చిన నివేదికను ప్రభుత్వం పూర్తిగా ఆమోదించిందని సీఎం ప్రకటించారు.

- సమయం న్యూస్, హైదరాబాద్

# దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత



సాంకేతికతను దేశానికి పరిచయం చేసిన రాజీవ్

రాజీవ్‌కు నివాళి అర్పించిన సీఎం రేవంత్

2

# రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా క్రీడా దినోత్సవం

3

# ఉత్తర తెలంగాణకు కేంద్రం కానుక


మణుగూరు-రామగుండం కొత్త రైల్వే లైన్‌కు ఆమోదముద్ర

5,818 కోట్లతో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు.. గిరిజన ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ

మేడారం, భద్రాచలం భక్తులకు ఊరట



2



# ఏపీలో భారీ పెట్టుబడులపై బాబు ఫోకస్

ఒప్పంద ప్రాజెక్టులు త్వరగా పూర్తి కావాలి

వాటికి అవసరమైన చర్యలు తీసుకోవాలి

మంత్రుల కమిటీతో భేటీలో సీఎం సూచనలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రా మిక ప్రగతిని వేగవంతం చే యడం, యువతకు ఉపాధి అ వకాశాలు కల్పించడమే లక్ష్యం గా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భారీ పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి సారించారు.

2



2

# బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు

119 నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల నియామకం

డిజిటల్ యాప్ ద్వారా సభ్యత్వాల పునరుద్ధరణ

# ఆగని గోవధ



- హిందువుల మనోభావాలతో ఆటలాడితే సహించం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

.. వివరాలు 3లో



# పంట కొనుగోళ్లపై మొద్దు నిద్ర వీడాలి

కాంటా పెట్టని కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది

రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఘాటు బహిరంగ లేఖ

రైతుల ఆత్మహత్యలు, కొనుగోలు కేంద్రాల సమస్యలపై మండిపాటు

రాష్ట్రంలో పంట కొనుగోళ్ల సంక్షోభంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర వీడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు.

.. 3లో



# సరస్వతీ నమస్తుభ్యం

## ఘనంగా సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభం

## కంచి పీఠాధిపతి రాక.. పుణ్యస్నానాలు చేసిన మంత్రులు

**సమయం న్యూస్, కాళేశ్వరం:** సరస్వతీ నది అంత్య పుష్కరాలు వైభవంగా ఆరంభమయ్యాయి. గురువారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ పుష్కరాలను ప్రారంభించారు. వీరంతా తొలుత పుష్కరస్నానం ఆచరించి ప్రారంభంచారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి తొలిసారి అంత్య పుష్కరాలు నిర్వహిస్తోంది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అసౌకర్యం కలగకుండా భారీ టెంట్లు, కూలర్లు సైతం ఏర్పాటు చేశారు. సరస్వతీ ఘాట్‌తోపాటు ప్రధాన ఘాట్ వద్ద స్నానాలు ఆచరించేవారు దుస్తులు మార్చుకొనేందుకు తాత్కాలిక గదులను 300కు పైగా ఏర్పాటు చేశారు. నదిలో లోతులోకి వెళ్లకుండా భద్రతా చర్యల్లో భాగంగా తాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. జూన్ 1 వరకు ప్రతిరోజు సాయంత్రం హారతి ఉంటుంది. అంత్య పుష్కరాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రాణహిత, గోదావరి నదుల్లో అంతర్వాహినిగా సరస్వతి నది ప్రవహిస్తున్న ప్రాంతంగా కాళేశ్వరం ప్రసిద్ధి చెందింది. దేశంలో సరస్వతి నది ఉన్నది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, రెండోది కాళేశ్వరంలోనే. అక్కడ కుంభమేళా నిర్వహించటం ఆనవాయితీ. కాగా, తెలంగాణలో తొలిసారి అంత్య పుష్కరాలకు సైతం ప్రాధాన్యమిచ్చి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయటం విశేషం. ఆది పుష్కరాల్లో నది స్నానం ఆచరించటం.. పితృతర్పణాలు ఇవ్వడం ఎలా ఫలితాలొస్తాయో.. అంత్య పుష్కర సమయంలోనూ ఆయా కార్యక్రమాలతో అవే ఫలితాలుంటాయని పండితులు చెబుతున్నారు.

# బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు

## 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిల నియామకం




**హైదరాబాద్, మే 21:** బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కోసం అధినేత కేసీఆర్ ఇన్‌ఛార్జిలను ప్రకటించారు. డిజిటల్ పక్రియలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు జరగనుంది. 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను బీఆర్ఎస్ అధినేత నియమించారు. నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు తెలంగాణ భవన్‌లో ఐటీ నిపుణులతో డిజిటల్ శిక్షణ ఇవ్వనున్నారు. సభ్యత్వ నమోదు కోసం డిజిటల్ యాప్‌ను రూపొందించారు. తెలంగాణ భవన్‌లో శిక్షణ తర్వాత.. పార్టీ జిల్లా కార్యాలయాల్లో పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. పోలింగ్ బూత్‌కు ఇద్దరు చొప్పున వారం రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. డిజిటల్ సభ్యత్వ నమోదు శిక్షణ పూర్తయిన తర్వాత.. సభ్యత్వ పునరుద్ధరణను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రారంభించనున్నారు.

# జర్నలిస్టులకు ఆర్థిక సాయం

## 21 మందికి మంజూరు చేసినట్లు వెల్లడి

**హైదరాబాద్, మే 21:** జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి 21 మందికి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారంనాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ 5వ సమావేశం చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆర్థిక సహాయం కోసం వచ్చిన 29 దరఖాస్తులను కమిటీ సభ్యులు పరిశీలించి 17 మంది మ-రణించిన జర్నలిస్టుల కుటుంబాలకు, తీవ్ర ప్రమాదాలకు గురైన, దీర&ర్ఘకాలికంగా అనారోగ్యం బారిన పడిన నలుగురు జర్నలిస్టులకు కూడా కమిటీ ఆర్థిక సహాయం మంజూరు చేసింది. కమిటీ సమావేశంలో ఎంపికైన 17 మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం, అలాగే ఆయా కుటుంబాలకు ప్రతి నెల మూడు వేల రూపాయల చొప్పున పెన్షన్ ఐదు సంవత్సరాల పాటు అందజేస్తామని ఆయన తెలిపారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలలో ఎల్.కే.జి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి నెలకు ఒక వెయ్యి రూపాయల చొప్పున ట్యూషన్ ఫీజును మంజూరు చేస్తున్నట్లు ఆయన వివరించారు. నలుగురు అనారోగ్యం బారిన పడిన వర్కింగ్ జర్నలిస్టులకు జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కమిటీ సమావేశంలో సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణ చందర్ రావు, మేనేజర్ డి.ఆర్.ఎస్. శైలెశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

- కేబినేట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం
- లబ్దిపొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు
- బండి తనయుడు భగీరథను పోలీసులే అరెస్ట్ చేశారు
- కేటీఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నాడన్న భ్రమలో ఉన్నారు
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి




**సమయం న్యూస్, హైదరాబాద్:** కార్మికులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయా రని.. అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని నియమించామని అన్నారు. సబ్ కమిటీ నివేదించిన అంశాలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు. కార్మికులను నాలుగు కేటగిరీలుగా చేశాం. అన్‌స్కిల్డ్, సెమి స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజించాం. వర్క్ జోన్లను మూడు భాగాలుగా విభజించాం. జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్స్, జోన్-2లో మున్సిపాలిటీలు, జోన్-3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీసవేతనం నిర్ణయించాం అన్నారు. అన్‌స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచాం. సెమి స్కిల్డ్ కేటగిరీలో రూ.13,152 నుంచి రూ.17 వేలకు.. స్కిల్డ్ కేటగిరీలో రూ.13,772 నుంచి రూ.18,500కు పెంచాం. హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ 1, 2026 నుంచి అమలవుతుందని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం ఇది. గత ప్రభుత్వం తన బాధ్యతను వదిలేసింది. మా ప్రభుత్వం బాధ్యతతో వారి ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుంది. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తొస్తారు. ఆయన వారసుడిగా మంత్రి వివేక్ వెంకటస్వామి.. కార్మికుల సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. యువతకు నేను ఒకటే సూచన చేస్తున్నా. ఐటీ, అమెరికా అనే ఆలోచనను వీడండి. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థం. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా యువత దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తోంది. అందుకే ఎన్నికలు అయిపోగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారు. మా ప్రభుత్వం ప్రతి అంశాన్నీ దీర్ఘకాలిక దృష్టితో చూస్తుంది. అందుకే కార్మికుల కనీస వేతనం పెంపుపై నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు పక్రియ 80 శాతం పూర్తయింది. ఇంకా 20 శాతం మిగిలి ఉంది. ఆ పక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారు. రైతుల విషయంలో శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా?. నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే తమ ఇంట్లోనే అప్పగించి ఉండేవారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి.. అంతేకాని దిగజారి ప్రవర్తించొద్దు. కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసు ఇచ్చి విచారించాం. బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నాం. పోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారు. కేటీఆర్ ఇంకా కల్వకుంట రాజ్యాంగంలోనే ఉన్నానని అనుకుంటున్నారని అంటూ ఎద్దేవా చేశారు. కేసీఆర్ దిగిపోయి చాలా రోజులు అయ్యింది. పార్టీ మీటింగ్ కోసం జగిత్యాలకు వెళ్లిన కేసీఆర్.. రాష్ట్రంలో ఇంత పెద్ద సంఘటన జరిగితే ఎందుకు బయటకు రాలేదు?. కులగణన విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. తెలంగాణ నిర్ణయాన్ని ఉన్నత న్యాయస్థానం సమర్థించడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం. తెలంగాణలో జనగణనతో పాటు కులగణన చేసి అన్ని వివరాలు ప్రజల ముందుంచాం. 'జనగణనలో కులగణన' విషయంలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలిచింది. మోదీ ప్రభుత్వం తక్షణమే జనగణనలో కులగణన చేర్చి బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలి' అని అన్నారు.

# దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత

## సాంకేతికతను దేశానికి పరిచయం చేసిన రాజీవ్

## రాజీవ్‌కు నివాళి అర్పించిన సీఎం రేవంత్



**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** దేశం కోసం ప్రాణాలర్పించిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీఎంతో పాటు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవాన్ని దేశానికి అందించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. 'కంప్యూటర్, ఐటీ, టెలికామ్‌లను దేశానికి తీసుకువచ్చింది ఆయనే. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు. రాహుల్‌గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసింది. తెలంగాణ సమాజం సోనియాగాంధీ కుటుంబానికి ఎంతో రుణపడి ఉంది. సోనియా సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ సాకారమైంది. మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులో మోదీ సర్కార్ కుయుక్తులు పన్నింది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు డీలిమిటేషన్‌తో లింక్ పెట్టారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. మహిళా బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ పార్లమెంట్‌లో పెట్టాలని సీఎం డిమాండ్ చేశారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ అని చెప్పు కొచ్చారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. అది కుటుంబ సంబంధం కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు... రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దానం నాగేందర్, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తర తెలంగాణకు కేంద్రం కానుక

## మణుగూరు-రామగుండం కొత్త రైల్వే లైన్‌కు ఆమోదముద్ర

## రూ.5,818 కోట్లతో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు

## గిరిజన ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ..

## మేడారం, భద్రాచలం భక్తులకు ఊరట



న్యూఢిల్లీ, మే 21: తెలంగాణ రవాణా రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాష్ట్రంలో ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న మణుగూరు--రామగుండం కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపింది. రూ.5,818.45 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును పబ్లిక్--ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో నిర్మించనున్నారు. 207.8 కిలోమీటర్ల పొడవుతో నిర్మించనున్న ఈ రైల్వే లైన్ మంథని, భూపాలపల్లి, తాడ్వాయి, గోపాలరావుపేటతో పాటు ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం మీదుగా వెళ్లనుంది. ప్రస్తుతం మణుగూరు నుంచి రామగుండం వెళ్లాలంటే భద్రాచలం రోడ్, కాజీపేట మీదుగా ప్రయాణించాల్సి వస్తుండగా, కొత్త లైన్ అందుబాటులోకి వస్తే దాదాపు 90 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఈ ప్రాజెక్టుతో ములుగు, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని మారుమూల గిరిజన ప్రాంతాలకు తొలిసారిగా రైల్వే కనెక్టివిటీ లభించనుంది. మేడారం సమ్మక్క--సారలమ్మ జాతర, భద్రాచలం దేవస్థానానికి వెళ్లే భక్తులకు ప్రయాణం మరింత సులభతరం కానుంది. అదేవిధంగా సింగరేణి బొగ్గు గనుల నుంచి బొగ్గు, ఖనిజాలు, ఎరువులు తదితర పారిశ్రామిక సరుకు రవాణాకు ఈ లైన్ కీలకంగా మారనుంది. దీంతో పారిశ్రామిక రవాణా వేగవంతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రాజెక్టు కోసం డీపీఆర్ తయారీ, భూసేకరణ, అనుమతుల బాధ్యతలను రైల్వే శాఖ చేపడుతుంది. నిర్మాణ పనులు, నిధుల సమీకరణ బాధ్యతలను ప్రైవేట్ భాగస్వామ్య సంస్థలకు అప్పగించనున్నారు. త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నట్లు సమాచారం. మొదటి ఏడాదిలో భూసేకరణ పూర్తి చేసి, ఐదేళ్లలో మొత్తం ప్రాజెక్టును పూర్తిచేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇదిలా ఉండగా, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీలో కలిశారు. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టుల పురోగతి, ఎంఎంటీఎస్ సేవల మెరుగుదల, 42 ప్రధాన రైల్వే స్టేషన్ల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణలో రైల్వే అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు.



# చట్టాలున్నా ఆగని గోవధ

## హిందువుల మనోభావాలతో ఆటలాడితే సహించం

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**హైదరాబాద్, మే 21:** తెలంగాణలో గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్‌లో గోవుల అక్రమ రవాణా, వధ జరుగుతోందని అన్నారు. చట్టాలు ఉన్నప్పటికీ కొందరు కావాలనే వాటిని ఉల్లంఘిస్తున్నారని ఆయన మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ జరుగుతోందని రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోమాత రక్షణ కోసం శాంతియుతంగా పనిచేస్తున్న గోరక్షకులు, బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని రాంచందర్ రావు ఆరోపించారు. గోరక్షకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ కార్యకర్తలపై విధించిన బైండోవర్ చర్యలను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గోవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రాంచందర్ రావు సూచించారు. గోవధకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ÷రిళిలీసులు పక్షపాత ధోరణిని విడిచిపెట్టి చట్టాన్ని అందరికీ సమానంగా అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు. గోమాత హిందువుల జీవన విధానంలో పవిత్రమైన భాగమని, పండుగల పేరుతో గోవధ చేస్తే సహించబోమని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే శక్తులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో గోవధ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన తమ కార్యకర్తలను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా క్రీడా దినోత్సవం



**హైదరాబాద్, మే 21:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 'స్పోర్ట్స్ అండ్ యూత్ వారోత్సవాలు' కార్యక్రమాల్లో భాగంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా 'క్రీడా దినోత్సవం'ను అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని 32 జిల్లా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్లు మరియు అధికార యంత్రాంగం పర్యవేక్షణలో జిల్లా యువజన మరియు క్రీడాశాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు విజయవంతంగా జరిగాయి. రాష్ట్ర స్థాయి ప్రధాన ఉత్సవాలు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడగా, యువత, క్రీడాకారులు, తల్లిదండ్రులు మరియు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జంట నగరాల్లోని గచ్చిబౌలి జీఎంసీబీ స్టేడియం, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, జింఖానా గ్రౌండ్స్, సైక్లింగ్ వెలోడ్రోమ్ తదితర క్రీడా వేదికల్లో ఇంటర్ స్టేడియా కాంపిటీషన్స్ నిర్వహించబడ్డాయి. పోటీల్లో అ÷-లథెటిక్స్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఫెన్సింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, ఫుట్‌బాల్, చెస్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, రెజ్లింగ్ తదితర క్రీడాంశాల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ. సోనీ బాలాదేవి ఈ పోటీలను స్వయంగా పర్యవేక్షించారు. ఆమె వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొంటున్న క్రీడాకారులను కలుసుకుని ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ అండ్ యూత్ వారోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. యువతతో పాటు క్రీడాకారులు, తల్లిదండ్రులు మరియు సమాజంలోని వివిధ వర్గాల ప్రజల నుండి ఈ కార్యక్రమాలకు విశేష ఆదరణ లభిస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల వారు, అన్ని వయస్సుల వారు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకునేలా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కృషి చేస్తోందని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొనే అవకాశాలను కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు రవితేజ, సుజాత, శ్రీనివాస్, స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు రవికుమార్, రాజ్‌వీర్, నందకిషోర్, కన్నం మధు, పీఆర్వో కాలేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రంలో మంటలు

**ఖమ్మం, మే 21:** ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో రైతులు పొలాల్లో చెత్తకు నిప్పంటించడంతో ఆ మంటలు గాలికి వ్యాపించి కొనుగోలు కేంద్రంలోని వరి ధాన్యం బస్తాలకు అంటుకున్నాయి. దీంతో అక్కడ కాంటాలు వేసి ఉంచిన వరి బస్తాలు ఒక్కసారిగా మంటల్లో చిక్కుకుని దగ్ధమయ్యాయి. రైతులు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ, గాలులు బలంగా వీయడంతో మంటలు అదుపులోకి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేసారు. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించినా స్పందన ఆలస్యమైందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో సుమారు లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు వాపోతున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి రాకపోతే ఇంకా పెద్ద ఎత్తున ధాన్యం నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పంట కొనుగోళ్లపై సీఎం మొద్దు నిద్ర వీడాలి

- రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఘాటు బహిరంగ లేఖ
- రైతుల ఆత్మహత్యలు, కొనుగోలు కేంద్రాల సమస్యలపై మండిపాటు
- కాంటా పెట్టని కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది



**హైదరాబాద్, మే 21:** రాష్ట్రంలో పంట కొనుగోళ్ల సంక్షోభంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర వీడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో రైతులు రోడ్డెక్కి నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజుల తరబడి పడిగాపులు పడుతున్నారని, కొందరు అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. రైతులు తమ పంటను తామే తగలబెట్టుకునే పరిస్థితి నెలకొనడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణ వ్యాప్తంగా రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారని, రాష్ట్రంలో రైతు నిరసనలతో హోరెత్తుతోందని తెలిపారు. కేసీఆర్ హయాంలో కొనుగోలు వ్యవస్థ పకడ్బందీగా సాగేదని, కరోనా సమయంలో కూడా చివరి గింజ వరకు కొనుగోలు చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం గన్నీ బ్యాగుల కోసం కూడా రైతులు డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. వరంగల్ నుంచి ఖమ్మం వరకు అనేక జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల్లో సరైన కొనుగోళ్లు జరగడం లేదని, కొన్నిచోట్ల ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదని ఆరోపించారు. కొనుగోళ్లలో భారీ తరుగులు తీస్తున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం బోనస్ ఇవ్వకపోవడమే కాకుండా, పంట కొనుగోలు కూడా చేయకపోతే రైతులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద మృతి చెందిన రైతు కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో మే 23న జరిగే కేబినెట్ సమావేశంలోనైనా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతుల పంటలను వెంటనే కొనుగోలు చేసి, వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందించాలని లేఖలో పేర్కొన్నారు.

# ఎంజేపీ బ్రాండింగ్ క్రియేట్ చేయాలి

## విద్యార్థులకు సమగ్ర విద్యాబోధన జరగాలి

## 8 వ తరగతి నుండే నీట్ ,ఎంసెట్ తర్ఫీదు

## 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు అభినందనలు

## పూలే గురుకుల పాఠశాలల ఫలితాలపై సమీక్షలో మంత్రి పొన్నం



హైదరాబాద్, మే 21: మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయాల పనితీరు పై మంత్రి పొన్నం ప్రభాకర్ గారు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రిన్సిపాల్స్ ను అభినందించారు. ఫలితాలు తక్కువగా వచ్చిన గురుకుల విద్యాసంస్థలు కారణాలు సమీక్షించుకోవాలని ఆయన సూచించారు. వచ్చే విద్యాసంవత్సరం మంచి ఫలితాలు సాధించేలా పని చేయాలిని ఆయన అన్నారు. సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలు వచ్చే విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండాలని ఆదిశగా అధ్యాపక బృందం పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు , సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్, ఏఐ, తదితర అంశాలపై ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలను అభిందించడంతో పాటు ఉత్తీర్ణత శాతం తక్కువగా వచ్చిన పాఠశాలల ప్రిన్సిపాల్ లను మందిలించారు. వచ్చే విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు రాబట్టాలని సూచించారు. గతంలో 327 స్కూల్ లలో 301 స్కూల్ లో ప్రైవేట్ భవనాల్లో ఉన్నాయని, ప్రభుత్వం విద్యకు ప్రధాన్యత ఇవ్వడం తో గురుకులాలు అద్భుతంగా పని చేస్తున్నాయనీ తెలిపారు. గురుకుల పాఠశాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ప్రభుత్వం మెస్ ఛార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వం మీద విశ్వాసంతో ,అధ్యాపకుల విశ్వాసంతో తమ పిల్లలను గురుకులాలకు పంపిస్తున్నారనీ తల్లిదండ్రుల కన్నా ఎక్కువగా ఉపాధ్యాయుల తోనే పిల్లలు సమయం ఇస్తారని తమ సొంత పిల్లల మాదిరి విద్యార్థులను చూసుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మంచైనా,చెడైనా అధ్యాపకులు దిక్సూచి అని తెలిపారు. 026-27 సంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని బీసీ సంక్షేమ శాఖ గురుకులాలు మరింత సమర్థవంతంగా విజయాలు సాధించాలనీ ఆకాంక్షించారు. ఎవరిని ఇబ్బంది పెట్టి పని చేయించుకోవడం లేదనీ పూర్తి స్థాయిలో విద్యా బోధన జరగాలనీ ఆదేశించారు.ప్రైవేట్ భవనాల్లో నెల వారి అ÷-దదె కడుతున్నప్పటికీ మౌలిక సదుపాయాలు లేకపోతే కల్పించుకునే బాధ్యత ప్రిన్సిపల్ లది సూచించారు.టాయిలెట్స్, ఫ్యాన్స్,ఇతర మౌలిక సదుపాయాలు ఏం ఇబ్బందులు లేకుండా చూసుకోవాలనీ తెలిపారు.ఎంజేపీ గురుకులాలు అద్భుతంగా ఉండాలంటే అందరూ కలిసి సమిష్టి గా ఒక కుటుంబం లాగ పని చేయాలన్నారు.పిల్లల ఉజ్వల భవిష్యత్తు జ్ఞాపకులపై ఆధారపడి ఉందన్నారు. సమాజంలో ఏ విధంగా బతకాలి , డిసిప్లెన్, తల్లిదండ్రుల తో ఎలా వ్యవహరించాలి..పెద్దలతో ఎలా మాట్లాడాలి అని విద్యార్థులకు నేర్పించాలని సూచించారు.చిన్న చిన్న కారణాలతో గురుకులాల్లో సూసైడ్ జరుగుతున్నాయని విద్యార్థుల్లో మనో ధైర్యాన్ని కల్పించాలని వారిలో మోటివేటివ్ కల్పించాలన్నారు.జిల్లాలో ఉన్న స్కూల్స్ వారిగా సమీక్ష లు చేస్తూ వంద శాతం ఫలితాలు వచ్చిన స్కూల్స్ అభినందిస్తూ.. తక్కువ ఫలితాలు వచ్చిన స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలనీ సూచించారు. అధ్యాపకులంతాఎంజేపీ కి బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేయాలనీ పేర్కొన్నారు.పదవ తరగతి 98.45 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల సెక్రెటరీ సైదులు తో పాటు ప్రిన్సిపల్ లను అభినందించారు.500 పైన వచ్చిన మార్కులు 9788 మంది విద్యార్థులకు వచ్చాయనీ204 ఎంజేపీ గురుకులాలు 100 శాతం ఫలితాలు సాధించాయనీ సంతోషం వ్యక్తం చేశారు.65 స్కూల్స్ వెనుకబడి ఉన్నాయనీ ఆ స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలి ఉత్తీర్ణత తక్కువగా వస్తె మంచిది కాదనీ హెచ్చరించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 90.31 శాతం ,ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 97.72 శాతం , ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం లో 85.80 శాతం, ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 95.81 శాతం పాస్ శాతం ఉందని 900 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 4183 మంది విద్యార్థులు ,980 మార్కులు పైన 496 మంది విద్యార్థులు సాధించారనీ ఇంటర్మీడియట్ లో తక్కువ ఉత్తీర్ణత శాతం వచ్చిన గురుకులాలను హెచ్చరించారు.35 విద్యా సంస్థలు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయనీ అభినందించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 8 విద్యా సంస్థలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు.ఎంజేపీ లో చదివిన పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులకు నేరుగా ఇంటర్మీడియట్ తరగతులకు అడ్మిషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.గురుకుల పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు ఇంకా ఏమి అవసరమని ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు.

# జాతీయ రహదారిపై కంటెయినర్‌లో మంటలు

## మంటల ధాటికి 8 కొత్త కార్లు బుగ్గి

**మెదక్, మే 21:** మెదక్ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. తూప్రాన్ సమీపంలో జాతీయ రహదారి ఎన్‌హెచ్-44పై ప్రయాణిస్తున్న కంటైనర్ లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మహారాష్ట్ర వైపు నుంచి హైదరాబాద్‌కు వస్తున్నఈ కంటైనర్ లారీ అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లారీలో కొత్తగా తరలిస్తున్న ఎనిమిది మారుతీ కార్లు ఉన్నాయి. మంటలు ఒక్కసారిగా వ్యాపించి కంటైనర్‌తో పాటు అన్ని కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు ఎగిసిపడటంతో జాతీయ రహదారిపై భయాందోళన వాతావరణం నెలకొంది. స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదం కారణంగారహదారిపై కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భద్రతా చర్యల్లో భాగంగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను పోలీసులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే విషయం. అయితే కోట్ల రూపాయల ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ లేదా సాంకేతిక లోపం వల్లే ఈ మంటలు చెలరేగి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వాన

## ఎండల తీవ్రతతో రికార్డు ఉష్ణోగ్రతలు

## పిడుగురాళ్లలో 48.1, ముత్తారంలో 46.5 డిగ్రీలు నమోదు

**హైదరాబాద్/విజయవాడ, మే 21:** ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. ఏపీ, తెలంగాణలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. అంతకంతకూ ఎండ తీవ్రత పెరిగిపోయి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు బయటకు అడుగుపెట్టాలంటేనే బాబోయో ఎండ అనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆకాశం నుంచి నిప్పుల వర్షం కురిపిస్తున్నాడా అన్నట్లుగా ఉష్ణోగ్రతలు రోజురోజుకూ రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. గురువారం రాష్ట్రంలో పలుచోట్ల రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలో అత్యధికంగా పిడుగురాళ్లలో 48.1, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.5, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్కాపురం జిల్లా కనిగిరిలో అత్యధికంగా 48.3 డిగ్రీలు నమోదు కాగా, కృష్ణా జిల్లా కంకిపాడులో 47.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏలూరు జిల్లా చింతలపూడిలో 47.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు, పల్నాడు జిల్లా అచ్చంపేటలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో 47.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు, ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు, బాపట్ల జిల్లా ఇంకొల్లులో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. ఏపీలోని వేటపాలెం (బాపట్ల), నందివాడ (కృష్ణా)ల్లో 47.6 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నందనమారెళ్ల (మార్కాపురం)లో 46.6, కూనవరం (పోలవరం)లో 46.5, కావలి (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు)లో 46.4, తెనాలి (గుంటూరు)లో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. 20 జిల్లాల్లోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం వరకు ఎండల తీవ్రత కొనసాగనుందని అధికారులు తెలిపారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో 46.4, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 46.2, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్‌లో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉ



ష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయి. భానుడి భగభగలతో జనం ఇంటి నుంచి కాలు బయట పెట్టడానికి భయపడుతున్నారు. ఏమైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా ఎండలకు హడలిపోతున్నారు. గత వారం నుంచి ఉదయం మొదలు కొని సాయంత్రం వరకూ తీవ్రమైన ఉక్కపోతతో పాటు సెగలు కక్కే ఎండే కనిపిస్తూ ఉండటంతో సాధారణమైన పనులు చేసుకోవడానికి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఈ ఎండలకు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ఏసీలు ఉన్న వారు ఏసీ చాటను, ఫ్యాన్లు ఉన్నవారు ఫ్యాన్ల మాటునే సేద తీరుతూ ఊపిరి పీల్చుకుంటున్నారు. సాయంత్రం ఆరు దాటితే గానీ ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ఈ ఎండల నుంచి ఎప్పుడు ఉపశమనం పొందుతామా అని ఎదురుచూస్తున్నారు ప్రజలు.




# రేవంత్ ఫ్యూచర్ సిటీ

## కలల నగరమా? కాగితాల ప్రాజెక్టా?

రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లు దాటింది. ఇక రేవంత్ రెడ్డికి ఉన్నది కేవలం రెండేళ్ల కాలం మాత్రమే. ఈ రెండేళ్లలో ఆయన అనుకున్న పనులు నెరవేరుస్తారా అన్నది అనుమానమే. ఎందుకంటే ఈ రెండున్నరేళ్లలో గట్టిగా ఒక నిర్మాణాత్మక పనికూడా చేపట్టలేదు. ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయాలేదు. ఎందుకంటే కేవలం సంక్షేమాలతో నెట్టుకు వస్తున్నారు. రేషన్ కార్డులు పెంచడం, సన్నబియ్యం ఇవ్వడం, రైతు భరోసా వేయడం వంటివన్నీ అభివృద్ధి కిందకు రావు. ఈ క్రమంలో ఆయన పెద్ద పనిని తలన పెట్టుకున్నారు. అదే ఫ్యూచర్ సిటీ. ఇప్పుడున్న హైదరాబాద్ ఇంతగా పెరగడానికి కొన్ని దశాబ్దాలు పట్టింది. మెల్లాగా ఇది అల్లుకుంటూ పోవడం వల్ల పెరిగందే తప్ప రాత్రికి రాత్రి పెరగలేదు. చంద్రబాబు సైబరాబాద్‌కు బీజం వేసినా, ఇవాళ ఓఆర్ఆర్ వరకు నగరం విస్తరించడానికి దాదాపు రెండున్నర దశాబ్దాల కాలం పట్టింది. అందువల్ల ఒక సిటీని కట్టాలంటే అనుకున్నంత ఈజీగా అమాంతంగా కట్టలేం. అమరావతి కోసం నిధులు ఉండీ చంద్రబాబు నానా తంటాలు పడుతున్నారు. మధ్యలో జగన్ మావిగన్ అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. అమరావతి ఇప్పట్లో పూర్తి అయ్యేలా లేదు. పోలవరం కట్టడానికి దాదాపు 15 ఏళ్లు పట్టింది. నిధులు ఉండి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తే ప్రణాళికా బద్దంగా ముందుకు సాగవచ్చు. కానీ ఫ్యూచర్ సిటీ కోసం రూపాయి కూడా వెచ్చించడానికి లేదు. నిధుల లేమి రాష్ట్రాన్ని పట్టి పీడిస్తోంది. అక్కడ భూములు సేకరించి ఉన్నాయి కనుక ఫ్యూచర్ సిటీ కట్టేయలేం. కొన్ని కార్యాలయాలు తరలించినా, కొందరికి భూములు కేటాయించినా ఇది సాధ్యం అయ్యే పనికాదు. దీనికి తోడు కేవలం రెండంటే రెండేళ్ల కాలం మాత్రమే ఉంది. ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, నెట్ జీరో తరహాలో రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో ఎలాంటి రాజీ పడొద్దని కూడా చెప్పారు. ఈ మేరకు ప్రపంచస్థాయి నగరాలను అధ్యయనం చేసి ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. ఇప్పటికే అక్కడ ఓ ఈవెంట్ నిర్వహించి, పెట్టుబడిదారులను ఆహ్వానించినా, అక్కడ ఎలాంటి మౌళిక వసతులు లేకుండా ఎలా అడుగు వేస్తారో అధికారుకలకు కూడా అర్థం కాదు. ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటు అంశాలపై ఎన్ని ఆదేశాలు జారీ చేసినా నిర్దిష్ట ప్రణాళిక మేరకు ముందుకు సాగాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టుల కోసం 500 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. మౌలిక సదు-పాయాల నిర్మాణం తర్వాతే భూ కేటాయింపులు జరపాలన్నారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకువచ్చేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను కూడా తీసుకొద్దామని, అవసరమైతే ప్రధాని నరేంద్రమోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామన్నారు. జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమల నిర్మాణం ప్రారంభించేలా నిబంధనలు రూపొందించాలన్నారు. పెట్టుబడులను ఆకర్షించటం కోసం 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని, దీనికి లోగో, వెబ్‌సైట్ రూపొందించాలని ఆదేశించారు. పెట్టుబడులకు ముందుకొచ్చేవారికి ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను తీసుకురావాలని, గ్రూప్-1 స్థాయి అధికారులను నియమించాలన్నారు. ఇవన్నీ బాగానే ఉన్నా, అక్కడ మౌళిక వసతులు, ముఖ్యంగా రోడ్లు, నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను పెద్ద ఎత్తున చేపట్టాల్సి ఉంటుంది. బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టు కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినా, అందుకు కేంద్రం త్వరగా నిధులు విడుదల చేయాల్సి ఉంది. 1500 ఎకరాల్లో డేటా సిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఫ్యూచర్ సిటీ దేనికి ప్రాధాన్యం అన్నది కూడా ముఖ్యమే. ఇప్పటికిప్పుడు అక్కడికి వెళ్లి ఉండలేం. అక్కడ ఎలాంటి మౌళిక వసతులు లేకుండా ఎవ్వరు కూడా ఉండలేరు. ఇది ఓరకంగా చెప్పాలంటే త్రిశంకు స్వర్గాన్ని సృష్టించడమే అవుతుంది. 2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రకటించారు. బహుశా ఇదే ధీమాతో మరో పదేళ్లకు దీని గురించి ప్లాన్ వేసుకున్నారా అన్నది తెలియదు. ఒకవేళ సిఎం రేవంత్ రెడ్డిని ప్రజలు మరోమారు గెలిపించక పోతే ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ ఏంటన్నది ప్రశ్నార్థకం. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఎవరు సిఎం అన్నది అప్పుడే నిర్ణయిస్తారు. ఒక్క వైఎస్ విషయంలో మాత్రమే రెండో ఆలోచన లేకుండా ఆయనను సిఎం చేశారు. అధిష్ఠానం ఎవరిని నిర్ణయిస్తే వారే ముఖ్యమంత్రి అని ప్రకటించడం కాంగ్రెస్ ఆనవాయితీ. దీనికి భిన్నంగా, వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్నారు. ఆయన చేసిన ఈ ప్రకటన కొంతమంది కాంగ్రెస్ నాయకులకు మింగుడు పడకపోవచ్చు. అయితే తనకు తాను ఇలా ప్రకటించుకున్నా, పరిస్థితులు మన చేతుల్లో లేవు. తమిళనాడు, కేరళ, బెంగాల్ పరిస్థితులు చూశాం. వచ్చే రెండేళ్లలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. కొంతమంది మంత్రులు సమాంతర వ్యవస్థలను నడుపుతున్నారన్న విమర్శ ఉంది. కాబట్టి నిర్మాణాత్మక వైఖరి అవసరం. అందుకు అనుగుణంగా కార్యాచారణ కావాలి. ప్రజల్లో ఇమేజ్ సంపాదించాలి. ఇవన్నీ చేసి, మళ్లీ అధికారంలోకి వస్తేనే ఫ్యూచర్ సిటీపై ప్రభావం ఉంటుంది. లేకుంటే ఈ రెండేళ్ల స్వల్ప కాలంలో ఇది మనుగడలోకి రావడం ముమ్మాటికీ సాధ్యం కాకపోవచ్చు.

# లోన్ రికవరీ ఆడగాలలకు కళ్లెం

- కొత్త నిబంధనలు ప్రతిపాదించిన ఆర్‌బీఐ
- కస్టమర్లను వేధించే చర్యలపై ఆంక్షలు




**న్యూఢిల్లీ, మే 21:** రుణాల వసూళ్ల పేరుతో కస్టమర్లను వేధించే బ్యాంకులు, రికవరీ ఏజెంట్లపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కఠిన చర్యలకు సిద్ధమైంది. లోన్ రికవరీ ప్రక్రియలో అనుసరించాల్సిన నియమావళిపై కొత్త ముసాయిదా నిబంధనలను ఆర్‌బీఐ విడుదల చేసింది. 'కండక్ట్ ఆఫ్ రెగ్యులేటెడ్ ఎంటిటీస్ ఇన్ రికవరీ ఆఫ్ లోన్స్ అండ్ ఎంగేజ్‌మెంట్ ఆఫ్ రికవరీ ఏజెంట్స్' పేరిట రూపొందించిన ఈ ముసాయిదాపై మే 31 వరకు ప్రజలు, వాటాదారుల అభిప్రాయాలను స్వీకరించనుంది. అక్టోబర్ 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. వ్యక్తిగత, కారు, గృహ రుణాల చెల్లింపుల్లో ఆలస్యం జరిగిన సందర్భాల్లో కస్టమర్ల మొబైల్ ఫోన్లను లాక్ చేయడం, ఫీచర్లను నిలిపివేయడం వంటి చర్యలకు ఆర్‌బీఐ అడ్డుకట్ట వేసింది. అయితే ఆ మొబైల్ లేదా టాబ్లెట్ కొనుగోలుకే బ్యాంకు రుణం ఇచ్చినట్లయితే మాత్రమే, అది కూడా 90 రోజుల గడువు దాటిన తర్వాతే పరిమిత చర్యలు తీసుకునే హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. అలాగే ఫోన్ బ్లాక్ చేసినా ఇంటర్నెట్ సేవలు, ఇన్‌కమింగ్ కాల్స్, అత్యవసర సేవలు, ప్రభుత్వ అత్యవసర అలర్టులను నిలిపివేయరాదని పేర్కొంది. ఒకవేళ కస్టమర్ బకాయిలు చెల్లిస్తే గంటలోపే ఫోన్‌పై ఉన్న ఆంక్షలు తొలగించాలని ఆదేశించింది. ఆలస్యం జరిగితే గంటకు రూ.250 చొప్పున బ్యాంకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. లోన్ రికవరీ కోసం బ్యాంకు సిబ్బంది లేదా రికవరీ ఏజెంట్లు చేసే కాల్స్, వాటి సమయాలు, ఉపయోగించిన నంబర్ల వివరాలను రికార్డ్ చేయాలని ఆర్‌బీఐ సూచించింది. ఆడియో, టెక్స్ట్ సంభాషణలను భద్రపరచాలని తెలిపింది. రుణగ్రహీతలతో అసభ్యంగా మాట్లాడటం, బెదిరింపులకు దిగడం, వ్యక్తిగత వివరాలు లేదా ఆడియో, వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడం వంటి చర్యలను పూర్తిగా నిషేధించింది. అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా అవమానకర సందేశాలు పంపడం, పదేపదే కాల్స్ చేసి వేధించడం వంటి చర్యలపై కూడా కఠిన ఆంక్షలు విధించనుంది. రుణాల వసూళ్ల ప్రక్రియలో పారదర్శకత, వినియోగదారుల గౌరవం కాపాడడమే ఈ కొత్త నిబంధనల ప్రధాన ఉద్దేశమని ఆర్‌బీఐ పేర్కొంది.

# ఎబోలా వైరస్ విజృంభణ

### ఇండియా-ఆఫ్రికా సమిట్ వాయిదా

### ఎయిర్‌పోర్ట్‌లో అడ్వయిజరీ జారీ

**న్యూఢిల్లీ, మే 21:** ఆఫ్రికాలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ముఖ్యంగా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ వంటి దేశాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ పరిణామాల నడుమ దిల్లీ వేదికగా ఈ నెల 28-31 తేదీల మధ్య జరగాల్సిన 'ఇండియా- ఆఫ్రికా ఫోరమ్ సమిట్' వాయిదా పడింది. భారత్, ఆఫ్రికన్ యూనియన్ కలిసి ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. కొత్త తేదీలను పరస్పర సంప్రదింపుల ద్వారా ఖరారు చేస్తామని తెలిపింది. ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజారోగ్యానికి సంబంధించి విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఆఫ్రికా సీడీసీ, సంబంధిత సంస్థలకు మద్దతు ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగశాఖ పేర్కొంది. మరోవైపు.. ఎబోలా వైరస్ వ్యవహారంలో దిల్లీ ఎయిర్‌పోర్టు అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేసిన విషయం తెలిసిందే. కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జ్వరం, తలనొప్పి, నీరసం, కండరాల నొప్పులు తదితర సమస్యలు కనిపిస్తే వెంటనే ఎయిర్‌పోర్టు వైద్యసిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎబోలా కారణంగా ఇప్పటివరకు 139 మంది మృతి చెందారు. దాదాపు 600 అనుమానిత కేసులను గుర్తించారు. కాంగోలో వైరస్ వ్యాప్తిని ఎదుర్కొనేందుకు తమకు మరింత సామగ్రి, సిబ్బంది అవసరమని అధికార వర్గాలు, సహాయక బృందాలు కోరాయి. మొదటి మరణం నమోదైన బునియా ప్రాంతానికి దాదాపు 20 టన్నుల సహాయ సామగ్రిని తరలించినప్పటికీ.. ఐసోలేషన్ గదుల కొరత కారణంగా వైద్యులు సాధారణ వార్డుల్లోనే ఎబోలా అనుమానిత రోగులకు చికిత్స అందిస్తున్నారు.

### ముందు జాగ్రత్తలు ప్రకటించిన కేంద్రం

ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ఆరోగ్య కార్యదర్శి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎబోలా వైరస్ నివారణకు అవసరమైన ముందుజాగ్రత్తలు, ఆరోగ్య సన్నాహాలు, అత్యవసర స్పందన చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం భారతదేశంలో ఎలాంటి ఎబోలా కేసులు నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడరేవుల్లో నిఘా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల స్క్రీనింగ్, అనుమానితులను క్వారంటైన్‌లో ఉంచడం, ప్రత్యేక పరీక్షా సదుపాయాలు కల్పించడం వంటి అంశాలపై రాష్ట్రాలకు వివరణాత్మక మార్గదర్శకాలు పంపింది. అదేవిధంగా ఆసుపత్రుల్లో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేయాలని, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించింది. గతంలో అంటువ్యాధుల సమయంలో అమలు చేసిన విధానాలను మళ్లీ కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది.






# పుల్వామా ఉగ్రదాడి సూత్రధారి హతం

### ఆక్రమిత కాశ్మీర్‌లో దుండగుల చేతిలో హతం

**న్యూఢిల్లీ, మే 21:** 2019 పుల్వామా ఉగ్రదాడికి కీలక సూత్రధారిగా భావిస్తున్న హమ్జా బుర్హాన్ పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో హతమైనట్లు సమాచారం. ముజఫరాబాద్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరపడంతో అతడు మృతి చెందినట్లు వార్తలు వస్తున్నాయి. 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్‌పై జరిగిన ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు మరణించారు .పుల్వామా దాడికి పాకిస్థాన్‌కు చెందిన జైష్-ఎ-మహ్మద్ ఉగ్రసంస్థ బాధ్యత వహించింది. జైష్-ఎ-మహ్మద్ సంస్థకు అనుబంధంగా పని చేసిన హమ్జా బుర్హాన్ పుల్వామా దాడి ప్రణాళికలో కీలక పాత్ర పోషించాడని భారత దర్యాప్తు సంస్థలు అనుమానించాయి. తాజాగా అతడు గుర్తు తెలియని వ్యక్తుల చేతుల్లో హతమవడం సంచలనంగా మారింది . ఇటీవల పాకిస్థాన్‌లో భారత వ్యతిరేక ఉగ్రవాదులు వరుసగా గుర్తు తెలియని వ్యక్తుల దాడుల్లో హతమవుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. గతంలో పఠాన్‌కోట్, సంజ్వాన్, కాందహార్ హైజాక్ వంటి ఘటనలతో సంబంధం ఉన్న పలువురు ఉగ్రవాదులు కూడా ఇదే తరహాలో మృతి చెందారు. కాగా, హమ్జా బుర్హాన్ హత్య వెనుక ఎవరు ఉన్నారో కనిపెట్టేందుకు స్థానిక అధికారులు దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

## పశ్చిమాసియా సంక్షోభ ప్రభావాలపై

# కేంద్ర కేబినెట్ కీలక చర్చ

### 11 నెలల తర్వాత మోదీ అధ్యక్షతన కీలక సమావేశం

### చమురు ధరలు, ఆర్థిక ప్రభావాలపై సమీక్ష



**ఢిల్లీ, మే 21:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన గురువారం సాయంత్రం కేంద్ర మంత్రిమండలి కీలక సమావేశం జరిగింది. దాదాపు 11 నెలల తర్వాత నిర్వహించిన ఈ కేబినెట్ సమావేశంలో దేశంలోని ప్రస్తుత పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. జూన్ 9న మోదీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. కేంద్ర కేబినెట్ సమావేశంలో ప్రధానంగా దేశంలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పురోగతిపై సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా ప్రజలకు చేరుతున్న సేవలు, వివిధ పథకాల అమలు స్థితి, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల ప్రభావంపై మంత్రులతో ప్రధాని మోదీ మాట్లాడుతున్నారు. అలాగే దేశవ్యాప్తంగా కొనసాగుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై కూడా సమీక్షించనున్నారు. రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు వంటి కీలక ప్రాజెక్టుల అమలు వేగం, పెట్టుబడుల పరిస్థితి, భవిష్యత్తు కార్యాచరణపై మంత్రివర్గంతో ప్రధాని చర్చించనున్నారు. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలకు దారితీస్తున్న పశ్చిమాసియా సంక్షోభంపై కూడా ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలోని పరిస్థితులు భారత ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావం, చమురు ధరల మార్పులు, వాణిజ్యంపై పడే ప్రభావం వంటి అంశాలను ప్రధాని మోదీ సమీక్షిస్తున్నారు. వివిధ మంత్రిత్వ శాఖల పనితీరు, తీసుకున్న నిర్ణయాలు, రాబోయే రోజుల కార్యాచరణపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రులు తమ శాఖలకు సంబంధించిన పురోగతి నివేదికలను ప్రధాని ముందు ఉంచినట్లు సమాచారం. ఈ సమావేశంలో భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలు, పెట్టుబడుల ప్రోత్సాహం, ఆర్థిక వృద్ధి, సంక్షేమ కార్యక్రమాల మరింత సమర్థవంతమైన అమలుపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

# భద్రతా మండలిలో మరోమారు పాక్ దుర్నీతి

### గట్టిగా తిప్పికొట్టిన భారత్ ప్రతినిధి

### నరమేథం చేసే పాక్‌కు మాట్లాడే హక్కులేదని విమర్శలు



**న్యూఢిల్లీ, మే 21:** అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలో భారత్‌పై నిందలు మోపేందుకు పాక్ ప్రయత్నించింది. అయితే, భారత్ వీటిని గట్టిగా తిప్పికొట్టింది. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సాయుధ ఘ-ర్షణల్లో పౌరులకు రక్షణ కల్పించే అంశంపై ఐరాసలో బహిరంగ చర్చ జరిగింది. ఈ సందర్భం గా పాక్ ప్రతినిధి జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ గట్టిగా తిప్పికొట్టారు. నరమేధ చర్యలకు పాల్పడే దేశం.. భారత అంతర్గత విషయాల గురించి ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది ఆరంభంలో అఫ్గానిస్థాన్ పై పాక్ జరిపిన దాడుల గురించి హరీష్ ప్రస్తావించారు. పవిత్ర రంజాన్ మాసంలో కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై జరిగిన దాడిని ప్రపంచం ఇంకా మరిచిపోలేదన్నారు. ఈ అమానుషమైన హింసాకాండలో 269 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 122 మంది గాయపడినట్లు తెలిపారు. 'చీకట్లో అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుంటూ.. అంతర్జాతీయ చట్టాల గురించి మాట్లాడటం పాక్ కపటత్వానికి నిదర్శనం' అని విమర్శించారు. తన సొంత ప్రజల పైనే బాంబులు వేస్తూ, జాతి నిర్మూలనకు పాల్పడే దేశం ఇలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడటంలో పెద్ద ఆశ్చర్యం కలిగించే విషయం కాదన్నారు.



# తిరుమలలో పెరిగిన రద్దీ

## వేసవి సెలవులతో భక్తుల రాక

## దర్శనానికి 24 గంటలకు పైగా సమయం

**తిరుమల, మే 21:** వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో రద్దీ పెరుగుతోంది. శ్రీవారి దర్శనానికి  కనీసం 24 గంటలపైగా సమయం పడుతోంది.  శ్రీవారి దర్శనానికి గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. దీంతో భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్2, నారాయణగిరి షెడ్స్ నిండిపోయి రింగ్ రోడ్డులోని పాచికాల్వ గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లో సుమారు నాలుగు కిలోమీటర్లు వేచి ఉన్నారు. సర్వదర్శనానికి 24 గంటలపైగా సమయం పడుతోందని తితిదే ప్రకటించింది. రద్దీ నేపథ్యంలో సంయమనంతో శ్రీవారిని దర్శించుకోవాలని తితిదే భక్తులకు సూచిస్తోంది. మరోవైపు తితిదే ఆధ్వర్యంలో ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు, అన్నప్రసాద కేంద్రాలు, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, ఆలయ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులు ఎప్పటికప్పుడు అంచనా వేసి, అధికారులు అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, పాలు, అన్న ప్రసాదాలు శ్రీవారి సేవకుల ద్వారా అందిస్తున్నారు. తితిదే యంత్రాంగం సమన్వయంతో భక్తులకు దర్శనం కల్పించేందుకు 24 గంటలూ ప్రత్యేకంగా దృష్టి సారించారు. పోలీసులు, తితిదే విజిలెన్స్ అధికారులు రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి రద్దీని నియంత్రిస్తున్నారు. రద్దీ నేపథ్యంలో అధికారులు భక్తులను క్యూలైన్లలోకి అనుమతించడం లేదు.

# చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం

**తిరుపతి, మే 21:** తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం రంగంపేట దగ్గర నాగపట్ల ప్రాంతం, రాగిమానుగుంటలో ఏనుగుల గుంపు బుధవారం రాత్రి బీభత్సం సృష్టించాయి. అర్ధరాత్రి  మామిడి తోటలోకి వచ్చిన ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి పూర్తిగా ధ్వంసం చేసాయి. ఏనుగుల గుంపు గ్రామ పరిసరాల్లోకి చొరబడి, అర్ధరాత్రి ఏనుగులు పంట పొలాల్లో భీకర శబ్దాలతో గీంకరిస్తుండగా, గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రైతుల మామిడి తోట, ఫెన్సింగ్ కూసాలు, నీటి పైపులను ఏనుగులు పూర్తిగా ధ్వంసం చేసాయి. మూడు రోజులుగా నాగపట్లలోనే గజరాజులు చేరినట్లు రైతులు అనుమానిస్తున్నారు. వెంటనే ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు గ్రామస్తులు తెలియజేశారు. అటవీశాఖ అధికారులు ఏనుగుల అటవీప్రాంతంలోకి తరిమేందుకు, బాణా సంచా పేలుస్తూ, డప్పు శబ్దాలతో ప్రయత్నించారు. పంట నష్టం తప్ప ఎటువంటి ప్రమాదం జరగలేదు. గ్రామస్తులు రాత్రిపూట బయటకు రాకూడదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు అటవీశాఖ అధికారులు తెలియజేసారు.

# విశాఖలో మూడు కీలక ప్రాజెక్టులు

**విశాఖపట్టణం, మే 21:** విశాఖలో మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధికి సంబంధించి 3 కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపినట్లు విశాఖ ఎంపి శ్రీ భరత్ తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకం కింద జివిఎంసి ప్రతిపాదించిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నేషనల్ అపెక్స్ కమిటీ ఆమోదం తెలిపినట్టు వివరించారు. రూ. 1,501.03 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టులను అమలు చేయబోతున్నట్లు చెప్పారు. మధురవాడ జోన్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధికి రూ. 658.61 కోట్లు, మధురవాడ జోన్‌లో స్మార్ట్ తాగునీటి సరఫరా వ్యవస్థ కోసం రూ. 725.18 కోట్లు, బల్క్ అండ్ సెమీ బల్క్ నీటి సరఫరా వ్యవస్థ ఆధునీకరణ కోసం రూ. 117.24 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ మూడు ప్రాజెక్టులు విశాఖపట్నం పట్టణ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని తెలిపారు.

# బక్రీద్ సెలవు 28కి మార్పు

**అమరావతి, మే 21:** ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ పండగ సెలవు దినాన్ని మారుస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముందుగా ప్రకటించిన మే 27న కాకుండా మే 28వ తేదీన ఈ బక్రీద్ సెలవు దినంగా ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు ఈ మార్పు వర్తిస్తుందని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. గతంలో ఏపీ ప్రభుత్వం విడుదల చేసిన వార్షిక క్యాలెండర్ ప్రకారం.. మే 27వ తేదీ బక్రీద్ సెలవుగా ప్రకటించారు. అయితే చంద్రదర్శనం ఆధారంగా పండుగ తేదీ మారింది. దాంతో సెలవు రోజును కూడా మార్చాలని ఏప రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్య నిర్వాహణాధికారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ బోర్డు సీఈవో చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పరిశీలించింది. అనంతరం సెలవును మే 28కి మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోవో జారీ చేశారు.

# గుంటూరు జిల్లాలో అగ్నిప్రమాదం

**గుంటూరు, మే 21:** గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికంగా ఉన్న ఓ స్క్రాప్ గోడౌన్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గోడౌన్‌లో నిల్వ ఉంచిన పాత ఇనుప సామాన్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు మంటలకు ఆహుతి అయ్యాయి. మంటలు చెలరేగిన కొద్ది సేపటికే అవి షెడ్డు అంతటా వేగంగా వ్యాపించాయి. దీంతో భారీ అగ్నికీలలు ఎగిసిపడుతూ, దట్టమైన పొగ ఆకాశాన్ని కమ్మేసింది. ప్రమాద తీవ్రతను గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న ÷ర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రమాదం కారణంగా భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు ప్రాథమిక సమాచారం. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# 'స్త్రీ శక్తి' థీమ్‌తో మహానాడు

- ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా చర్చ
- పెట్టుబడులు, యువతకు అవకాశాలపై ప్రస్తావన
- టీడీపీ పొలిట్ బ్యూరోలో పలు అంశాలపై చర్చ



**అమరావతి, మే 21:** 2026 మహానాడును 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహించాలని పొలిట్‌బ్యూరో టిడిపి నిర్ణయించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు మహిళా సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు, మహిళల భాగస్వామ్యంతో అమలు చేసిన కార్యక్రమాలను మహానాడు వేదికగా ప్రజలకు తెలియజేయాలని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సూచించారు. మహిళల భాగస్వామ్యంతోనే ప్రతి సంక్షేమ పథకాన్ని రూపొందించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, యువతకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలపై మహానాడులో సమగ్ర చర్చ జరగాలని దిశానిర్దేశర చేశారు. తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం గురువారం మంగళగిరిలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. నూతన కార్యవర్గం, పొలిట్‌బ్యూరో నియామకం తర్వాత తొలిసారి ఈ భేటీ జరిగింది. ఈ సమావేశానికి వర్చువల్‌గా  తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ భేటీలో మహానాడు నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మహానాడు వేదికగా చేపట్టాల్సిన తీర్మానాలు, పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రచారంపై విస్తృతంగా చర్చించారు. ఈసారి మహానాడులో మొత్తం 20 కీలక తీర్మానాలను ప్రవేశపెట్టాలని పొలిట్‌బ్యూరో నిర్ణయించింది. వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన 10 తీర్మానాలు, తెలంగాణకు సంబంధించిన 4 తీర్మానాలు, అండమాన్‌కు సంబంధించిన ఒక తీర్మానం, ఉమ్మడి అంశాలపై 4 తీర్మానాలు, రాజకీయ తీర్మానాలు ఉండనున్నాయి. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పెట్టుబడులు, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లేలా మహానాడును నిర్వహించాలని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహానాడును పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమానికి రెండు రోజుల ముందే ప్రతి ఇంటిపై టీడీపీ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ అగ్రనాయకత్వం నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు అందరినీ మహానాడులో భాగస్వాములను చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మహానాడు ప్రారంభానికి ముందు రాష్ట్రంలోని అన్ని క్లస్టర్లలో దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు విగ్రహాలకు నివాళులు అర్పించి కార్యక్రమాలను ప్రారంభించాలని నిర్ణయించారు. అలాగే ఎన్టీఆర్ సిద్ధాంతాలు, తెలుగుదేశం పార్టీ చరిత్రను నేటి తరానికి తెలియజేసేలా ప్రత్యేక ప్రజెంటేషన్లు నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ ఆవిర్భావం నుంచి జరిగిన రాజకీయ, సామాజిక మార్పులను మహానాడు వేదికగా ప్రదర్శించాలని సీఎం మార్గనిర్దేశర చేశారు. పొలిట్ బ్యూరో సమావేశంలో వైసీపీపై కూడా తీవ్ర విమర్శలు చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టిస్తున్న 'గొడ్డలి పార్టీ కుట్రలను' మహానాడు వేదికగా ప్రజల ముందుంచాలని నిర్ణయించారు. అలాగే 'నా దేశం-నా బాధ్యత' పేరుతో పొదుపు చర్యలు, సామాజిక బాధ్యతలపై ప్రత్యేక చర్చలు నిర్వహించనున్నారు.

# ఏపీలో భారీ పెట్టుబడులుపై బాబు ఫోకస్

- ఒప్పంద ప్రాజెక్టులు త్వరగా పూర్తి కావాలి
- వాటికి అవసరమైన చర్యలు తీసుకోవాలి
- మంత్రుల కమిటీతో భేటీలో సీఎం సూచనలు



**అమరావతి, మే 21:** విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ)లో ఆమోదించిన ప్రాజెక్టులపై మంత్రుల కమిటీతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. నారా లోకేశ్ నేతృత్వంలోని కమిటీకి ఎంవోయూలు, ప్రాజెక్టుల పురోగతిపై సీఎం దిశానిర్దేశం చేశారు. ఎస్ఐపీబీ ద్వారా ఇప్పటికి రూ. 11.47 లక్షల కోట్ల పెట్టుబడులతో 282 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని చంద్రబాబు గుర్తుచేశారు. వీటిలో 114 ప్రాజెక్టులు గ్రౌండ్ అయినట్టు సీఎంకు మంత్రుల కమిటీ ఛైర్మన్ నారా లోకేశ్ వివరించారు. భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులకు అనుమతులు, భూ కేటాయింపులతో పాటు మిగిలిన ప్రాజెక్టులు గ్రౌండింగ్‌కు వెళ్లేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. రాష్ట్ర అభివృద్ధికి ఇవి కీలక మైలురాళ్లుగా నిలుస్తాయని సీఎం పేర్కొన్నారు. పెట్టుబడిదారులతో కుదిరిన ఒప్పందాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఎంఓయూలకు సంబంధించిన ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు మంజూరు చేయాలని, అవసరమైన భూ కేటాయింపులు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు ఆదేశించారు. ప్రాజెక్టులు త్వరగా గ్రౌండింగ్ దశకు చేరి పరిశ్రమలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం మాత్రమే కాకుండా, అవి వేగంగా అమలై యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం చేయడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి సీఎస్ సాయిప్రసాద్‌తో పాటు మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైబ్రిడ్ విధానంలో టీడీపీ మహానాడు

## 19 తీర్మానాలకు పొలిట్ బ్యూరో ఆమోదం

## టీడీపీ అధినేత చంద్రబాబు వెల్లడి



**అమరావతి, మే 21:** హైబ్రిడ్ విధానంలో నిర్వహించే మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సమావేశం ముగిసింది. మహానాడు నిర్వహణ ప్రధాన అజెండాగా సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. కార్యకర్తే అధినేత అనేది మహానాడులో వినిపించాలన్నారు. మహిళలకు తెలుగుదేశం ఇస్తున్న ప్రాధాన్యం మహానాడు వేదికగా అందరికీ అర్థమయ్యేలా చాటాలని సూచించారు. సంప్రదాయ ఓటును జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలు పార్టీ ఆవిర్భావం నుంచీ వెన్నుదన్నుగా ఉన్నారని చెప్పారు. బీసీల అభివృద్ధికి పార్టీ కట్టుబడి ఉందనే సందేశం స్పష్టంగా వెళ్లాలని నేతలకు తెలిపారు. రోజూ ఉదయం 9 గంటల నుంచే 2 రోజుల మహానాడు ప్రారంభిద్దామన్నారు. మండల స్థాయిలో నిర్వహిద్దామనే ప్రతిపాదనపైనా చర్చ జరగాలన్నారు. క్లస్టర్ స్థాయిలోనే నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. మహానాడులో ప్రవేశపెట్టే 19 తీర్మానాలకు పొలిట్ బ్యూరో ఆమోదం తెలిపింది. సమయపాలన పాటించాలని.. ప్రతి వక్తా తమకు కేటాయించిన అంశంలో నిష్ణాతుడై సమయపాలన పాటిస్తూ విషయం సూటిగా చెప్పాలని ఆదేశించారు. మహానాడులో ప్రవేశపెట్టే తీర్మానాలపై సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వాన

## ఎండల తీవ్రతతో రికార్డు ఉష్ణోగ్రతలు

## పిడుగురాళ్లలో 48.1, ముత్తారంలో 46.5 డిగ్రీలు నమోదు



**హైదరాబాద్/విజయవాడ, మే 21:** ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. ఏపీ, తెలంగాణలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. అంతకంతకూ ఎండ తీవ్రత పెరిగిపోయి రికార్డు స్థాయిలో  ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు బయటకు అడుగుపెట్టాలంటేనే బాబోయో ఎండ అనే పరిస్థితులు కనిపిస్తున్నాయి.  ఆకాశం నుంచి నిప్పుల వర్షం కురిపిస్తున్నాడా అన్నట్లుగా ఉష్ణోగ్రతలు రోజురోజుకూ రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. గురువారం రాష్ట్రంలో పలుచోట్ల రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలో అత్యధికంగా పిడుగురాళ్లలో 48.1, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.5, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్కాపురం జిల్లా కనిగిరిలో అత్యధికంగా 48.3 డిగ్రీలు నమోదు కాగా, కృష్ణా జిల్లా కంకిపాడులో 47.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏలూరు జిల్లా చింతలపూడిలో 47.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు, పల్నాడు జిల్లా అచ్చంపేటలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో 47.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు, ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు, బాపట్ల జిల్లా ఇంకొల్లులో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. ఏపీలోని వేటపాలెం (బాపట్ల), నందివాడ (కృష్ణా)ల్లో 47.6 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నందనమారెళ్ల (మార్కాపురం)లో 46.6, కూనవరం (పోలవరం)లో 46.5, కావలి (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు)లో 46.4, తెనాలి (గుంటూరు)లో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. 20 జిల్లాల్లోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం వరకు ఎండల తీవ్రత కొనసాగనుందని అధికారులు తెలిపారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో 46.4, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 46.2, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్‌లో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయి. భానుడి భగభగలతో జనం ఇంటి నుంచి కాలు బయట పెట్టడానికి భయపడుతున్నారు. ఏమైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా ఎండలకు హడలిపోతున్నారు. గత వారం నుంచి ఉదయం మొదలు కొని సాయంత్రం వరకూ తీవ్రమైన ఉక్కపోతతో పాటు సెగలు కక్కే ఎండే కనిపిస్తూ ఉండటంతో సాధారణమైన పనులు చేసుకోవడానికి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఈ ఎండలకు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ఏసీలు ఉన్న వారు ఏసీ చాటను, ఫ్యాన్లు ఉన్నవారు ఫ్యాన్ల మాటునే సేద తీరుతూ ఊపిరి పీల్చుకుంటున్నారు.  సాయంత్రం ఆరు దాటితే గానీ ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ఈ ఎండల నుంచి ఎప్పుడు ఉపశమనం పొందుతామా అని ఎదురుచూస్తున్నారు ప్రజలు.

# తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా పండుగ ఇన్ ఛార్జీల నియామకం

**33 జిల్లాలకు స్టేట్, డిస్ట్రిక్ట్ ఇన్ ఛార్జీలను నియమించిన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్:,మే21( సమయం న్యూస్). :** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా పండుగ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ నెల 20 నుంచి వచ్చే నెల వరకు రాష్ట్ర వ్యాప్తంగా జెండా పండుగ కార్యక్రమం నిర్వహణ జరగనుంది. ఈ నేపథ్యంలో జెండా పండుగ నిర్వహణకు సంబంధించి జిల్లా వారీగా, నియోజక వర్గాల వారీగా ఇంఛార్జ్ లను స్టేట్ అబ్జర్వర్లు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత నియమించారు. 33 జిల్లాలతో పాటు 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్ ఛార్జీల నియామించారు. నెల రోజుల పాటు నిర్వహించే టీఆర్ఎస్ జెండా పండుగ ను జిల్లా, నియోజకవర్గ ఇన్ ఛార్జీలు, స్టేట్ అబ్జర్వర్లు పర్యవేక్షించనున్నారు.

33 జిల్లాలకు సంబంధించి జిల్లా ఇంఛార్జ్ లు, స్టేట్ అబ్జర్వర్ల పేర్ల జాబితా

నిజామాబాద్
జిల్లా ఇంఛార్జ్: రంగు నవీన్ ఆచారి
స్టేట్ అబ్జర్వర్: కరిమిల్ల బాబు రావు

కామారెడ్డి
జిల్లా ఇంఛార్జ్: ఆదురుగట్ల సంపత్ గౌడ్
స్టేట్ అబ్జర్వర్: కోల శ్రీనివాస్

ఆదిలాబాద్
జిల్లా ఇంఛార్జ్: రంగినేని శ్రీనివాస్ రావు
స్టేట్ అబ్జర్వర్: మేకల లలిత యాదవ్

నిర్మల్
జిల్లా ఇంఛార్జ్: జుట్టు చంద్రశేఖర్
స్టేట్ అబ్జర్వర్: మంథని నవీన్ రెడ్డి

కొమురం భీమ్ ఆసిఫాబాద్
జిల్లా ఇంఛార్జ్: వినోద్ కరిమిల్ల
స్టేట్ అబ్జర్వర్: బాబురావు రాథోడ్

మంచిర్యాల
జిల్లా ఇంఛార్జ్: ఉదారి చంద్ర మోహన్ గౌడ్
స్టేట్ అబ్జర్వర్: వరలక్ష్మి మంచాల

కరీంనగర్
జిల్లా ఇంఛార్జ్: చందా లక్ష్మీనారాయణ గుప్తా
స్టేట్ అబ్జర్వర్: కందాడి మణిపాల్ రెడ్డి

మెదక్
జిల్లా ఇంఛార్జ్: పొండ్ల చంద్రశేఖర్
స్టేట్ అబ్జర్వర్: అప్పాల నరేందర్ యాదవ్

నల్గొండ
జిల్లా ఇంఛార్జ్: పడిగపాటి విక్రాంత్ రెడ్డి
స్టేట్ అబ్జర్వర్: దేవేందర్ రెడ్డి కుందురు

సూర్యాపేట
జిల్లా ఇంఛార్జ్: కే ఎల్ ఎన్ రావు
స్టేట్ అబ్జర్వర్: విజయ్ గరినే

సిద్దిపేట
జిల్లా ఇంఛార్జ్: కొట్టాల యాదగిరి
స్టేట్ అబ్జర్వర్: లోక రవి చంద్ర

సంగారెడ్డి
జిల్లా ఇంఛార్జ్: మసన్న గారి బాలయ్య
స్టేట్ అబ్జర్వర్స్: నెల్లోజు శల్వ చారి, దేశోజు సందీప్

రాజన్న సిరిసిల్ల
జిల్లా ఇంఛార్జ్: ఎండి మజీద్ అబ్దుల్
స్టేట్ అబ్జర్వర్: కొంగరి ధరణి రాణి

పెద్దపల్లి
జిల్లా ఇంఛార్జ్ లు : కొమురయ్య సలేంద్ర, ఎల్ వెంకటేష్
స్టేట్ అబ్జర్వర్: పొన్నమనేని బాలాజీ రావు

వరంగల్ ఛ హన్మకొండ
జిల్లా ఇంఛార్జ్: నడిపెల్లి వెంకటేశ్వర రావు
స్టేట్ అబ్జర్వర్: సయ్యద్ ఇస్మాయిల్

జగిత్యాల
జిల్లా ఇంఛార్జ్: చెర్లపల్లి అమర్‌దీప్ గౌడ్
స్టేట్ అబ్జర్వర్: మాధవి మరిపెల్లి

జయశంకర్ భూపాలపల్లి
జిల్లా ఇంఛార్జ్: కుషన నరేష్ నేత
స్టేట్ అబ్జర్వర్: మెదల అభిలాష్ గౌడ్

మహబూబాబాద్
జిల్లా ఇంఛార్జ్: శ్రీకాంత్ గౌడ్ నలమాస
స్టేట్ అబ్జర్వర్: కిషన్ నాయక్ బానోత్

జనగామ
జిల్లా ఇంఛార్జ్: చిలుక ప్రవీణ్
స్టేట్ అబ్జర్వర్: కలబ్‌గూర్ దయాకర్ రెడ్డి

ములుగు
జిల్లా ఇంఛార్జ్: నంగవత్ రాజేష్ నాయక్
స్టేట్ అబ్జర్వర్: మెదల అభిలాష్ గౌడ్

ఖమ్మం
జిల్లా ఇంఛార్జ్: గట్టు కరుణ
స్టేట్ అబ్జర్వర్: చలసాని విష్ణు మూర్తి

భద్రాద్రి కొత్తగూడెం
జిల్లా ఇంఛార్జ్: దేవళ్ల వీరన్న
స్టేట్ అబ్జర్వర్: రియాజ్ అహ్మద్

యాదాద్రి భువనగిరి
జిల్లా ఇంఛార్జ్: చందుపట్ల సుజిత్ రావు
స్టేట్ అబ్జర్వర్: పవన్ రావు పోనుగోటి

మహబూబ్‌నగర్
జిల్లా ఇంఛార్జ్: మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్
స్టేట్ అబ్జర్వర్: గుంజపడుగు హరిప్రసాద్

నాగర్‌కర్నూల్
జిల్లా ఇంఛార్జ్: పోనుగోటి శ్రీపతి రావు
స్టేట్ అబ్జర్వర్: సురేందర్ జీ హకీంకరి

వనపర్తి
జిల్లా ఇంఛార్జ్: కందుర్ మాలతి రెడ్డి
స్టేట్ అబ్జర్వర్: కోట్ల మహేందర్ రెడ్డి

నారాయణపేట
జిల్లా ఇంఛార్జ్: గావినోళ్ల శ్రీనివాస్
స్టేట్ అబ్జర్వర్: పుల్లూరి శ్రీనివాస్ రావు

జోగులాంబ గద్వాల
జిల్లా ఇంఛార్జ్: గొంగళ్ల రంజిత్ కుమార్
స్టేట్ అబ్జర్వర్: ఆర్ వి ఆర్ ప్రసాద్

రంగారెడ్డి
జిల్లా ఇంఛార్జ్: నరేష్ ప్రజాపతి
స్టేట్ అబ్జర్వర్: తాండ్ర శ్రీనివాస్ రావు

వికారాబాద్
జిల్లా ఇంఛార్జ్: కోల శ్రీనివాస్
స్టేట్ అబ్జర్వర్: లకావత్ రూప్ సింగ్

మేడ్చల్ మల్కాజిగిరి
జిల్లా ఇంఛార్జ్: రామిడి వెంకట్ రెడ్డి
స్టేట్ అబ్జర్వర్లు: రంగు నవీన్ ఆచారి, కిషోర్ తానింటి

హైదరాబాద్
జిల్లా ఇంఛార్జ్: భగవతుల సాయి మహేష్
స్టేట్ అబ్జర్వర్: ఎండి అబ్దుల్ సలీమ్

సికింద్రాబాద్
జిల్లా ఇన్-చార్జ్: విజయ్ గరినే
స్టేట్ అబ్జర్వర్: డేవిడ్ గజ్జి

# రీల్స్‌తో ములుగు పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలి

- లోకల్ టు గ్లోబల్‌గా ములుగు జిల్లా ఘన కీర్తిని ప్రపంచానికి తెలియజేయాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు మే21( సమయం న్యూస్) :** ఇన్‌ఫ్లుయెన్సర్లు రీల్స్‌తో ములుగు జిల్లా పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలని, లోకల్ టు గ్లోబల్‌గా ములుగు జిల్లా ఘన కీర్తిని ప్రపంచానికి పరిచయం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పిలుపునిచ్చారు. గురువారం ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు గారు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ములుగు జిల్లా టూరిజంను ప్రపంచానికి పరిచయం చేసేందుకు నిర్వహిస్తున్న ఈ కాంపిటీషన్‌పై ఇన్‌ఫ్లుయెన్సర్లు, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా హ్యాండ్లర్లతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి చర్చించారు. రీల్స్ కాంపిటీషన్ విధివిధానాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, బహుమతుల వివరాలు తదితర అంశాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాలలో భాగంగా మొదటిసారిగా వినూత్న పద్ధతిలో ములుగు జిల్లాలోని అనేక పర్యాటక ప్రాంతాలకు బ్రాండింగ్ కలిగించే విధంగా 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్' నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ములుగు జిల్లా పర్యాటక ప్రాంతాలపై 4ఖ వీడియో క్వాలిటీతో రీల్స్ సమర్పించాల్సి ఉంటుందని, ఆసక్తి కలవారు తమ వీడియోలను మే 21వ తేదీ నుంచి మే 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సమర్పించవచ్చని, ఆన్‌లైన్ విధానంలో డీపీఆర్ఓ రఫీక్ 99483 92976, ఏపీఆర్ఓ వేణు 9494970535 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించవచ్చని పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి జూన్ 2వ తేదీన ప్రథమ బహుమతి రూ.21,000, ద్వితీయ బహుమతి రూ.15,000, తృతీయ బహుమతి రూ.10,000 అందించబడుతుందన్నారు. ములుగు జిల్లాలో ఆధ్యాత్మిక దేవాలయాలు, ప్రకృతి పర్యాటక కేంద్రాలు, జలపాతాలు, అభయారణ్య అందాలు, గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు కలగలిసి అనేక పర్యాటక ప్రాంతాలు ప్రకృతి వైవిధ్యభరితంగా నెలవై ఉన్నాయని పేర్కొన్నారు. జూన్ మాసం నుంచి పర్యాటక ప్రాంతాలకు ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుందని, వారందరికీ ములుగు జిల్లా సాదర ఆహ్వానం పలుకుతుందన్నారు. రీల్స్ కాంపిటీషన్ ద్వారా ములుగు జిల్లా పర్యాటక ప్రాంతాలకు మంచి బ్రాండింగ్ వచ్చే విధంగా పూర్తి వివరాలతో, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా రీల్స్‌ను రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఎం.డి. రఫీక్, ఈడీఎం దేవేందర్, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా హ్యాండ్లర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు తదితరులు పాల్గొన్నారు.

# యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని యువ విద్యార్థులకు.

- "వృత్తి నైపుణ్యం & భవిష్యత్తు నైపుణ్య సాధికారత" పై అవగాహన కార్యక్రమం.
- జిల్లా యువజన మరియు క్రీడల అధికారి (FAC),నారాయణపేట జిల్లా



**నారాయణపేట, మే,21(సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా యువజన మరియు క్రీడల శాఖ మరియు వారియర్ డిఫెన్స్ అకాడమీ నారాయణపేట్ వారి ఆధ్వర్యంలో "వృత్తి నైపుణ్యం ఛ భవిష్యత్తు నైపుణ్య సాధికారత" లో భాగంగా గురువారం నారాయణపేట జిల్లాలోని శ్రీ వేద సరస్వతి జూనియర్ కళాశాల నందు 200 యువ విద్యార్థులకు అనుభవజ్ఞులైన మోటివేషనల్ స్పీకర్ శ్రీనివాసులు గారిచే వృత్తి నైపుణ్యం పట్ల అవగాహన కల్పించడం అయినది .ఈ కార్యక్రమం నందు డి వై ఎస్ ఓ. ఎస్ వెంకటేష్, వారియర్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ రవికుమార్ గౌడ్, శ్రీ వేద సరస్వతి కళాశాల వైస్ ప్రిన్సిపల్ భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 14న యూపిఎస్సీ-సిఎస్ఎటి పరీక్ష శిక్షణ కొరకు ప్రవేశ పరీక్ష

- జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పి.నరేష్ కుమార్ నాయుడు
- మే 31 లోపు సివిల్స్ ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్ష దరఖాస్తు చేసుకోవాలి

**పెద్దపల్లి, మే21( సమయ్దం న్యూస్) :** జూన్ 14న యూపిఎస్సీ-సిఎస్ఎటి పరీక్ష శిక్షణ కొరకు ప్రవేశ పరీక్ష నిర్వహణ ఉంటుందని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పి.నరేష్ కుమార్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారు యూపిఎస్సి -- సిఎస్ఎటి 2027 పరీక్ష కోసం 100 మంది మైనారిటీస్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్‌ను నిర్వహిస్తోందని, ఇట్టి శిక్షణకు రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరీలలో వికలాంగులకు 5 శాతం సీట్లను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్ లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు అందరూ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 5లక్షల రూపాయలకు మించకూడదని తెలిపారు. యుపిఎస్సి (సిఎస్ఎటి -2026) యొక్క సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లో ప్రవేశం కోసం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని సాధారణ/ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీస్ అభ్యర్థుల దరఖాస్తులు ఆన్‌లైన్ https://cet.cgg.gov.in/tmreis వెబ్ సైట్ ద్వారా మే 31 లోపు స్వీకరిస్తామని అన్నారు. యుపిఎస్సి (సిఎస్ఎటి - 2027) శిక్షణ కోసం స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష జూన్ 14న ఉదయం 10.30 నుండి 12.30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల, రంగంపల్లిలో నిర్వహించబడు తుందని, ఇతర వివారాలకు ఆన్‌లైన్ ఇతర వివరాలకు www.cet.cgg.gov.in/tmreis వెబ్సైట్ లో, ఈ మెయిల్ directormscccte-langana@gmail.com , ఫోన్ నెం. 040-23236112 లో పని దినాలలో సంప్రదించాలని పి.నరేష్ కుమార్ నాయుడు ఆ ప్రకటనలో తెలిపారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్



**నారాయణపేట, మే,21(సమయం న్యూస్) :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్ లో నేడు శుక్రవారం ఉదయం 9:30 గంటలకు నిర్వహించే జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి హాజరవుతున్నారనీ జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక తెలిపారు. జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.



**హైదరాబాద్, మే 21,( సమయం న్యూస్). :** తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ గురువారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో టీజీ-ఈఏపీసెట్ వ్యవసాయ, ఫార్మసీ విభాగంలో రాష్ట్ర స్థాయి ఓవరాల్ తొలి ర్యాంక్ సాధించిన ముక్రం అహ్మద్‌ను సన్మానించారు. టీఎంఆర్ఈఐఎస్ విద్యార్థి అయిన ముక్రం అహ్మద్ 150.17 మార్కులతో రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించడం పట్ల షబ్బీర్ అలీ అభినందనలు తెలిపారు. భవిష్యత్ విద్యా, వృత్తి జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇతర ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కూడా ఆయన అభినందించారు. అస్మా జుబిన్ బయోపీసీ-2 విభాగంలో రాష్ట్ర రెండో ర్యాంక్, షారిఖా ముస్కాన్ బయోపీసీ-2లో రాష్ట్ర మూడో ర్యాంక్, హురాయా దిల్సాత్ ఎంపీసీ-1లో రాష్ట్ర మూడో ర్యాంక్, ఆయేషా సిద్దీఖా బయోపీసీ-1లో రాష్ట్ర మూడో ర్యాంక్, అఫియా తబ్బసుం బయోపీసీ-1లో రాష్ట్ర నాలుగో ర్యాంక్ సాధించినందుకు ప్రత్యేకంగా ప్రశంసించారు.

# నూతన బోరు బావి తవ్వక పనులకు ప్రారంభించిన జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్





**వికారాబాద్, మే,21(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (ఙుజ)లో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ గురువారం నూతన బోరు బావి తవ్వక పనులకు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, శిక్షణ కేంద్రంలో మౌలిక వసతులను కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం అధికారులతో సమావేశమై, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిటిసి డిఎస్పీ శ్రీనివాసులు, డిసిఆర్బి డిఎస్పీ జానయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ అభిలాష్ తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# పీఏ లగ్జరీ లైఫ్‌పై మునుగోడులో చర్చ

**మునుగోడుమే21( సమయం న్యూస్). :** కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి పీఏ పబ్బు రాజు గౌడ్ లగ్జరీ జీవనశైలిపై మునుగోడు, చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల ఆయన డిఫెండర్ కారు కొనుగోలు చేసినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కొంతమంది వ్యాపారవేత్తలు పబ్బు రాజు గౌడ్‌పై తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. తమను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని, డబ్బులు ఇవ్వనివారిపై అక్రమ కేసులు పెట్టించి ఇబ్బందులకు గురిచేశారని వారు ఆరోపిస్తున్నారు. కష్టపడి సంపాదించిన డబ్బులతో ఆయన లగ్జరీ జీవితం గడుపుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపే వ్యాపారవేత్తలను కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వచ్చే ఎన్నికల్లో రాజ్‌గోపాల్‌రెడ్డి ఓటమికి పబ్బు రాజు గౌడ్ వ్యవహారశైలి కారణవ-ఎవుతుందని మునుగోడు నియోజకవర్గంలో కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఎండలు

**హైదరాబాద్: మే21( సమయం న్యూస్) :** తెలంగాణలో ఎండల తీవ్రత మరింత పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వేడి గాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

వడదెబ్బతో ఒక్కరోజే 11 మంది మృతి చెందినట్లు సమాచారం. అత్యవసరం అయితే తప్ప పగటిపూట బయటకు రావొద్దని, తగినంత నీరు తాగాలని అధికారులు సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# హత్నూరలో ధాన్యం కొనుగోలు నిర్లక్ష్యంపై కలెక్టర్ సీరియస్

- డి.సి.ఓ, హత్నూర ఎంపీడీవో, ఏపీఎంలకు షోకాజ్ నోటీసులు జారీ
- ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరిక

**సంగారెడ్డి, మే 21( సమయం న్యూస్) :** హత్నూర మండలంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం, సమన్వయ లోపాలు, పర్యవేక్షణలో వైఫల్యాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్, హత్నూర ఎంపీడీవో బి.శంకర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజశేఖర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. హత్నూర మండలంలో ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు సంతృప్తికరంగా నిర్వహించబడటం లేదని గుర్తించామని, కొనుగోలు కేంద్రాల వద్ద పర్యవేక్షణ, మానిటరింగ్, సమన్వయంలో తీవ్ర లోపాలు ఉన్నట్లు వెల్లడైందన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫీల్డ్ స్థాయిలో సమర్థవంతమైన పర్యవేక్షణ లేకపోవడం, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యాలు చోటుచేసుకోవడం, సంబంధిత శాఖలు, ఏజెన్సీల మధ్య సమన్వయం లోపించడం వల్ల కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరుగుతున్నట్లు గుర్తించామన్నారు ,రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సకాలంలో పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, మూడు రోజుల లోగా తమ వివరణ సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.



కలెక్టర్ ఆఫీస్ లోని తన ఛాంబర్ నందు టూరిస్ట్ గైడ్ పోస్టర్ ను జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎస్. ప్రభాకర్, సమాచార శాఖ ఏ.పి.ఆర్.ఓ హబీబ్, మేరా యువభారత్ శాఖ అధికారి శశాంక్ లతో కలసి ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు జి. జితేందర్ రెడ్డి.

# పంట కొనుగోళ్లపై సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ

**హైదరాబాద్: మే21( సమయం న్యూస్) :** రాష్ట్రంలో పంట కొనుగోళ్లలో తీవ్ర సంక్షోభం నెలకొందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజుల తరబడి పడిగాపులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రైతులు ప్రాణాలు కోల్పోతున్నా, పంటలు తగలబెట్టుకుంటున్నా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొద్దునిద్ర వీడడం లేదని ధ్వజమెత్తారు. ఈ నెల 23న జరిగే కేబినెట్ సమావేశంలోనైనా పంట కొనుగోళ్లపై తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, మరణించిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించాలని కేటీఆర్ కోరారు. లేకపోతే రైతుల ఆగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ప్రతిపక్షాల విమర్శలతో రాజకీయ వేడి

**ధాన్యం కొనుగోళ్లు, ఫ్యూచర్ సిటీ, ఫాక్స్‌కాన్ పెట్టుబడులపై ఆరోపణలు -- ప్రత్యారోపణలు**

**హైదరాబాద్, మే 21:( సమయం న్యూస్) :** రాష్ట్ర రాజకీయాల్లో గురువారం విమర్శలు, ఆరోపణలు హాట్‌టా పిక్‌గా మారాయి. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం నుంచి ఫ్యూచర్ సిటీ, ఫాక్స్‌కాన్ పెట్టుబడులు, పోలీస్ వ్యవస్థ, యంగ్ ఇండియా స్కూళ్ల వరకు పలు అంశాలపై ప్రతిపక్ష నేతలు ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు.

రాష్ట్రంలోని మార్కెట్లలో ధాన్యం పేరుకుపోయినా ప్రభుత్వం కాంటాలు ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

మంచిరేవుల ప్రాంతంలోని 114 ఎకరాల ఆలయ భూములపై కొందరు కన్నేశారని, భూ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపించాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, తెలంగాణలో ఫాక్స్‌కాన్ పెట్టుబడులు సాకారం కావడం గర్వకారణమని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. చైనాకు ప్రత్యామ్నాయంగా కొంగర కలాన్‌ను ఎంపిక చేయించడంలో తన కృషి కీలకమైందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ దందా జరుగుతోందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ ఆరోపించారు. ప్రజల భూములను లక్ష్యంగా చేసుకుని ప్రాజెక్టులు అమలు చేస్తున్నారని విమర్శించారు. మట్టి మాఫియా చేతిలో చెరువులు ధ్వంసమవుతున్నాయని మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. సహజ వనరుల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుందా అని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. చట్టవ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం తగ్గుతోందన్నారు. బండి సంజయ్‌పై ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయ డ్రామాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. మేఘా వంటి కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసమే యంగ్ ఇండియా స్కూళ్లను తీసుకొస్తున్నారని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపించారు. విద్యా రంగాన్ని వ్యాపార ప్రయోజనాలకు వాడుకుంటున్నారని విమర్శించారు.

# ఈ--సిగరెట్ల అక్రమ రవాణా రాకెట్ గుట్టురట్టు

- రూ.120 కోట్ల విలువైన 3 లక్షల వేప్‌లు స్వాధీనం

**న్యూఢిల్లీ, మే 21:( సమయం న్యూస్) :** దేశవ్యాప్తంగా ఈ--సిగరెట్లు, వేప్‌ల అక్రమ దిగుమతులపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ భారీ చర్యలు చేపట్టింది. మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్‌లోని పలు పోర్టులు, విమానాశ్రయాలు, ఐసీడీలలో నిర్వహించిన తనిఖీల్లో సుమారు రూ.120 కోట్ల విలువైన 3 లక్షల ఎలక్ట్రానిక్ సిగరెట్లు/వేప్‌లను స్వాధీనం చేసుకుంది. చైనా నుంచి వచ్చిన ఈ నిషేధిత ఉత్పత్తులను “ఫర్నిచర్”, “మెటల్ చైర్ పార్ట్స్” పేర్లతో తప్పుడు ప్రకటనల ద్వారా దిగుమతి చేసేందుకు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. ప్రజారోగ్య రక్షణ దృష్ట్యా భారత్‌లో ఈ--సిగరెట్లు, ఎలక్ట్రానిక్ నికోటిన్ డెలివరీ సిస్టమ్స్ తయారీ, దిగుమతి, అమ్మకం, నిల్వ, ప్రకటనలు నిషేధితమని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

# రాబోయే అధికారం మనదే.

- జులైలో లక్షలాదిమందితో భారీ బహిరంగ సభకు టీఆర్పీ ప్రణాళిక
- సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించిన టీఆర్పీ చీఫ్ మల్లన్న
- నెల రోజుల పాటు సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్
- ప్రతీ కార్యకర్తకు రూ.5 లక్షల ప్రమాద బీమా
- టీఆర్పీ రాష్ట్ర కమిటీ సంచలన నిర్ణయాలు



**హైదరాబాద్: మే21(సమయం న్యూస్) :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం నేడు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. సమావేశం ప్రారంభంలో ఇటీవల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు ప్రధాన కార్యక్రమాలను రాష్ట్ర కమిటీ సమీక్షించింది. ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా =జు 2009 చట్టం అమలు కోసం ఏప్రిల్ 26న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన “చలో ఇందిరా పార్క్” కార్యక్రమం, మే 1న జరిగిన మాజీ మావోయిస్టుల భారీ చేరికలు, అలాగే సూర్యాపేటలో నిర్వహించిన కామ్రేడ్ మారోజు వీరన్న స్మారక సభలను విజయవంతంగా నిర్వహించినందుకు రాష్ట్ర కమిటీ సభ్యులందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ ధన్యవాద తీర్మానం ఆమోదించింది. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్ గారు మాట్లాడుతూ, ఈ కార్యక్రమాలు పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా విశేష గుర్తింపు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజల్లో పార్టీపై విశ్వాసం మరింత పెరిగిందని అభిప్రాయపడ్డారు. అనంతరం జులై నెలలో లక్షలాది మంది ప్రజలతో భారీ బహిరంగ సభ నిర్వహించాలని రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. ఈ సభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించాలని,అందుకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి సభ ఏర్పాటు బాధ్యతలను పార్టీ ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ గారికి అప్పగించారు. ముఖ్యంగా బహుజన వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని నిర్ణయించారు. పార్టీ బలోపేతానికి కీలకంగా భావించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈరోజు పార్టీ అధ్యక్షులు తీన్మార్ మల్లన్న గారు అధికారికంగా ప్రారంభించారు. వచ్చే నెల 25వ తేదీ వరకు దాదాపు నెల రోజుల పాటు ఈ సభ్యత్వ నమోదు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులంతా ముందుగా సభ్యత్వం నమోదు చేసుకుని కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ అధ్యక్షుడు మల్లన్న గారు మాట్లాడుతూ, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామస్థాయి వరకు విస్తరించేలా పక్క ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో కార్యకర్తలను చేర్చుకుని పార్టీని బలపరచడం లక్ష్యమన్నారు. సభ్యత్వ రుసుమును ₹200గా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇదే సమయంలో సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు ₹5 లక్షల ప్రమాద బీమా కల్పించనున్నట్లు ప్రకటించారు. ప్రమాదంలో అంగవైకల్యం కలిగితే ₹2.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. ఇది బహుజన వర్గాల పట్ల పార్టీ ఇచ్చే భరోసా అని ఆయన స్పష్టం చేశారు. ఇకపై పార్టీని గ్రామ స్థాయి వరకు విస్తరించేందుకు ప్రతి మండలం, గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. విద్యార్థి, కార్మిక, మహిళ, యువజన విభాగాలను బలోపేతం చేస్తూ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్,ప్రధాన కార్యదర్శులు గంగాధర్ లింగాల, మదన్మోహన చారి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నరసయ్య గౌడ్, ఉప కోశాధికారి కొక్కలకొండ మనోజ్, రాష్ట్ర కార్యదర్శులు పసల ప్రసన్న, మహమ్మద్ అఖిల్ పాషా, కొమ్ముల ప్రవీణ్ రాజ్, ఆర్ భావన వెంకటేష్, శివ వీర్ రెడ్డి, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ వనజ, ఉమెన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నీరజ గౌడ్, కార్మిక విభాగం అధ్యక్షుడు సంకురి శ్రీనివాస్,యూత్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, స్టూడెంట్ వింగ్ ప్రెసిడెంట్ మీా రాజు గౌడ్, సోషల్ మీడియా స్టేట్ కన్వీనర్ మనోజ్ ఆకుల, మైనారిటీ ప్రెసిడెంట్ సల్మాన్,రాష్ట్ర సహాయ కార్యదర్శి బుర్ర మల్లేశం పాల్గొన్నారు. స్టేట్ ఆఫీస్ కోఆర్డినేటర్ లింగం యాదవ్ పాల్గొన్నారు..

# సోలార్ విద్యుత్ నిల్వతో సింగరేణికి ఆదా







**నాలుగు నెలల్లో రూ.26 లక్షల ఆర్థిక లబ్ధి**

**హైదరాబాద్, మే 21( సమయం న్యూస్).:** సోలార్ విద్యుత్ నిల్వలో సింగరేణి సంస్థ సత్ఫలితాలు సాధిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మందమర్రి ఏరియాలోని 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసిన 1 మెగావాట్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ద్వారా నాలుగు నెలల్లో రూ.25.66 లక్షల ఆర్థిక లబ్ధి చేకూరింది

పగటిపూట ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్తులో స్థానిక అవసరాలకు వినియోగించని మిగులు విద్యుత్తును ఉచితంగా గ్రిడ్‌కు ఇవ్వకుండా, బ్యాటరీలో నిల్వ చేసి అవసరమైనప్పుడు వినియోగిస్తున్నారు. ఈ విధానంతో ఇప్పటివరకు 3,35,485 యూనిట్ల విద్యుత్తును నిల్వ చేసి ఉపయోగించుకున్నట్లు సింగరేణి తెలిపింది. రూ.2.5 కోట్ల వ్యయంతో మందమర్రి ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థ రాష్ట్రంలోనే తొలి అతిపెద్ద ప్రయోగాత్మక ప్రాజెక్టుగా నిలిచింది. సింగరేణి సంస్థ ఇప్పటికే 8 చోట్ల 245.5 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసింది. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ విజయవంతం కావడంతో, పునరుత్పాదక ఇంధన రంగంలో మరిన్ని ప్రాజెక్టులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని సింగరేణి యాజమాన్యం పేర్కొంది.

# ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కార్మికుల సంఖ్యను పెంచాలి.

- పనిస్థలాల్లో ఉపాధి హామీ కార్మికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



**లక్ష్మీదేవి పల్లి మే21( సమయం న్యూస్) :** లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న ఏం ఐ ట్యాంక్ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం పరిశీలించారు. గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లిన కలెక్టర్ అక్కడ పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడి వారికి వేతనాలు సకాలంలో అందుతున్నాయా, పనుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పనిస్థలాల్లో కార్మికులకు తాగునీరు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పని సమయంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆక్టివ్ జాబ్ కార్డుల వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం 300 జాబ్ కార్డులు ఉండగా ప్రస్తుతం 146 మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఉపాధి హామీ పనులపై గ్రామస్థులకు మరింత అవగాహన కల్పించి అర్హులైన ప్రతి కుటుంబం నుంచి ఎక్కువ మంది పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కార్మికుల సంఖ్యను పెంచి గ్రామీణ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు మరింత విస్తరించేలా చూడాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాస్టర్ కార్డు లు పరిశీలించి ఒక కుటుంబం నుంచి ఎంతమంది పనులకు వస్తున్నారు, పని దినాలు సక్రమంగా నమోదవుతున్నాయా అనే అంశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. పనుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని, ప్రతి కార్మికుడి హాజరు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనులు గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని, నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ పనులను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సర్పంచ్ కంగాల అంజలి డిఆర్డిఓ విద్యాచందన, తాసిల్దార్ శిరీష, పంచాయతీ సెక్రటరీ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్‌తో ప్రజల వద్దకే పోలీసు సేవలు

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.
- ఒక ఫోన్ కాల్‌తో మీ వద్దకే పోలీసు సేవలు
- సంఘటన స్థలానికే చేరుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్న పోలీసులు
- అత్యవసర సమయంలో ప్రజలకు అండగా జిల్లా పోలీసులు




**నారాయణపేట, మే,21(సమయం న్యూస్) :** ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో నారాయణపేట జిల్లా పోలీసులు ఆన్‌సైట్ -ఎఫ్ఐఆర్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఖూా తెలిపారు. ఫిర్యాదు దారులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా, సంఘటన జరిగిన ప్రదేశానికే వెళ్లి ఫిర్యాదులను స్వీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేసే ఈ విధానం ద్వారా బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా, నమ్మకమైన పోలీసు సేవలు అందించాలనే ఉద్దేశంతో నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ 'ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్' విధానాన్ని అమలు చేస్తోంది. బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల్లో, సంఘటన స్థలానికే వెళ్లి ఫిర్యాదు స్వీకరించి వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా బాధితులకు తక్షణ న్యాయం అందించేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతోంది. ప్రత్యేకించి మహిళపై అత్యాచారాలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, చోరీలు, గొడవలు, మిస్సింగ్ కేసులు, లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, ర్యాగింగులు, వృద్ధులు, దివ్యాంగులు, గ్రామీణ ప్రాంత ప్రజలు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న బాధితులకు ఈ సేవ ఎంతో మేలు అనేక సందర్భాల్లో ప్రజలుఅత్యవసర సమయంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితుల్లో 100 డయల్ కు గాని లేదా సంబంధిత పోలీస్ అధికారికి నేరుగా ఫోన్ చేసి సమాచారం అందజేస్తే పోలీసు అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి తక్షణ చర్యలు ప్రారంభిస్తారు. సమస్య ఎక్కడ జరిగినా... ప్రజలకు పోలీసు సహాయం త్వరగా అందాలన్నదే మా లక్ష్యం. ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అవసరమైన చర్యలు తీసుకుంటారు. దీనివల్ల సమయం ఆదా కావడంతో పాటు కేసుల దర్యాప్తు మరింత వేగంగా, సమర్థవంతంగా జరుగుతుందని, జిల్లా పోలీసులు ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించే దిశగా కృషి చేస్తున్నారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలి. ప్రతి ఫిర్యాదుపై బాధ్యతాయుతంగా స్పందించి బాధితులకు న్యాయం అందించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఈ విధానం ద్వారా ఇప్పటికే పలు కేసుల్లో బాధితులకు వేగవంతమైన న్యాయం అందుతున్నట్లు తెలిపారు. భయపడకుండా ముందుకు వచ్చి సమాచారం అందిస్తే పోలీసు శాఖ ప్రతి బాధితుడికి అండగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.

# ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపిఎస్ ఆదేశాల మేరకు

- కొడంగల్ సర్కిల్ లోని వరి రైస్ మిల్లులను ఆకస్మికంగా సందర్శించి పరిస్థితులను సమీక్షించిన...
- పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి,అదనపు కలెక్టర్, ఇతర అధికారులు





**కొడంగల్ సర్కిల్,మే,21(సమయం న్యూస్) :** పరిగి డీఎస్పీ,శ్రీనివాస్, కోడంగల్ సిఐ శ్రీధర్ రెడ్డి మరియు ఇతర పోలీస్ అధికారులు, సంబంధిత శాఖ అధికారులతో పాటు అదనపు కలెక్టర్ తో కలిసి కోడంగల్ సర్కిల్ పరిధిలోని దుద్యాల మండలంలోని గౌరారం వరి మిల్లు మరియు బొంరాస్‌పేట్ మండలంలోని బురన్‌పూర్ దుర్గా భవానీ వరి మిల్లును ఆకస్మికంగా సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మిల్లుల యజమానులు, సిబ్బంది మరియు రైతులతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియ, తూకాల నిర్వహణ, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందుతున్నదా, తూకాల్లో అవకతవకలు ఉన్నాయా అనే అంశాలను పరిశీలించారు. ప్రస్తుతం కొనుగోళ్లు పారదర్శకంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.మిల్లుల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు, రైతులను మోసం చేసే దళారులు, అక్రమ కొనుగోళ్లు లేదా తూకాల్లో మోసాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు.

## రీల్స్‌తో మెదక్ పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలి

- లోకల్ టు గ్లోబల్‌గా మెదక్ జిల్లా ఘన కీర్తిని ప్రపంచానికి తెలియజేయాలి
- టూరిస్ట్ గైడ్ కోసం దరఖాస్తుల సమర్పించాలి

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ మే21( సమయ్దం న్యూస్) :** ఇన్‌ఫ్లుయెన్సర్లు రీల్స్‌తో మెదక్.జిల్లా పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలని, లోకల్ టు గ్లోబల్‌గా మెదక్ జిల్లా ఘన కీర్తిని ప్రపంచానికి పరిచయం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు.గురువారం మెదక్ జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.మెదక్ జిల్లా టూరిజంను ప్రపంచానికి పరిచయం చేసేందుకు నిర్వహిస్తున్న ఈ కాంపిటీషన్‌పై ఇన్‌ఫ్లుయెన్సర్లు, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా హ్యాండ్లర్లతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి చర్చించారు. రీల్స్ కాంపిటీషన్ విధివిధానాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, బహుమతుల వివరాలు తదితర అంశాలను వారికి వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాలలో భాగంగా మొదటిసారిగా వినూత్న పద్ధతిలో మెదక్ జిల్లాలోని అనేక పర్యాటక ప్రాంతాలకు బ్రాండింగ్ కలిగించే విధంగా 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్' నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతాలపై 4ఖ వీడియో క్వాలిటీతో రీల్స్ సమర్పించాల్సి ఉంటుందని, ఆసక్తి కలవారు తమ వీడియోలను మే 21వ తేదీ నుంచి మే 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సమర్పించవచ్చని, ఆన్‌లైన్ విధానంలో డీపీఆర్ఓ ఝుబ 9949922291, ఏపీఆర్ఓ బాబు 9701306838 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించవచ్చని పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి జూన్ 2వ తేదీన నగదు ప్రోత్సాహకాలు అందించబడుతుందన్నారు. మెదక్ జిల్లాలో ఆధ్యాత్మిక దేవాలయాలు, ప్రకృతి పర్యాటక కేంద్రాలు, జలపాతాలు, అభయారణ్య అందాలు, గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు కలగలిసి అనేక పర్యాటక ప్రాంతాలు ప్రకృతి వైవిధ్యభరితంగా నెలవై ఉన్నాయని పేర్కొన్నారు. జూన్ మాసం నుంచి పర్యాటక ప్రాంతాలకు ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుందని, వారందరికీ మెదక్ జిల్లా సాదర ఆహ్వానం పలుకుతుందన్నారు. రీల్స్ కాంపిటీషన్ ద్వారా మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతాలకు మంచి బ్రాండింగ్ వచ్చే విధంగా పూర్తి వివరాలతో, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా రీల్స్‌ను రూపొందించాలన్నారు.పర్యాటక దినోత్సవ టూరిస్ట్ గైడ్ పోస్టర్ను ఆవిష్కరించారు.టూరిస్ట్ గైడ్ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు అట్టి దరఖాస్తులను నిబంధనలు మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, పాత్రికేయులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, యూట్యూబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఏపీ పర్యటన

### ఎన్నారై సమస్యల పరిష్కారానికి రెండు రాష్ట్రాలు సమిష్టిగా కృషి చేయాలి

**హైదరాబాద్/అమరావతి, మే 21:( సమయం న్యూస్) :** గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారం, ప్రవాస భారతీయుల సంక్షేమం, నకిలీ ఏజెంట్ల నియంత్రణ తదితర అంశాలపై అధ్యయనం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ చేపట్టిన రెండు రోజుల ఆంధ్రప్రదేశ్ పర్యటన విజయవంతంగా ముగిసింది.తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ డా. బీఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, ప్రభుత్వ విప్ మరియు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితరుల నేతృత్వంలో ఈ పర్యటన కొనసాగింది.పర్యటన రెండో రోజు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చీ=× సెల్ అమలు చేస్తున్న విధివిధానాలపై ఏపీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ సీఐడీ చీఫ్ డా. రవిశంకర్ అయ్యనార్, ఇతర అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నారై సెల్ అందిస్తున్న సేవలను వివరించారు. విదేశాల్లో చిక్కుకున్న బాధితులను స్వదేశానికి రప్పించడం, వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ, నకిలీ ఏజెంట్లపై చర్యలు తదితర అంశాలను వివరించారు.

ప్రవాస భారతీయులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై ఇరుపక్షాలు పరస్పరం సలహాలు, సూచనలు పంచుకున్నాయి. ముఖ్యంగా నకిలీ ఏజెంట్ల బారిన పడుతున్న అమాయక ప్రజలను రక్షించేందుకు తీసుకుంటున్న చర్యలు, గల్ఫ్ బాధితుల సమస్యల పరిష్కారంపై మేధోమథనం జరిగింది.నిరక్షరాస్యులు ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భాల్లో ఫిర్యాదుల స్వీకరణ, సహాయక చర్యలపై ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ప్రశ్నలు లేవనెత్తగా, అధికారులు వివరణ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.ఏపీ ఎన్నారై సెల్ ద్వారా ఇప్పటివరకు నకిలీ ఏజెంట్లపై 113 కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. విదేశాల్లో చిక్కుకున్న 87 మంది బాధితులను స్వదేశానికి రప్పించడంతో పాటు, మరణించిన 10 మంది మృతదేహాలను కుటుంబాలకు అప్పగించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రతినిధులు ఏపీ పోలీసులు అమలు చేస్తున్న ఎన్నారై సేవలను అభినందిస్తూ, తెలంగాణలో రూపొందించనున్న కొత్త ఎన్నారై విధానాల్లో పలు అంశాలను అమలు చేయనున్నట్లు తెలిపారు.సమావేశం అనంతరం ఏపీ ఎన్నారై సెల్ ప్రతినిధులు తెలంగాణ అడ్వైజరీ కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు. రెండు తెలుగు రాష్ట్రాలు పరస్పర సహకారంతో ఎన్నారై సమస్యల పరిష్కారానికి కలిసి పనిచేయాలని నిర్ణయించాయి.

## జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి 21 మంది కి ఆర్థిక సహాయం మంజూరు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్ మే21( సమయం న్యూస్) :** గురువారంనాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ 5వ సమావేశం చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆర్థిక సహాయం కోసం వచ్చిన 29 దరఖాస్తులను కమిటీ సభ్యులు పరిశీలించి 17 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు, తీవ్ర ప్రమాదాలకు గురైన, దీరర్ఘుకాలికంగా అనారోగ్యం బారిన పడిన నలుగురు జర్నలిస్టులకు కూడా కమిటీ ఆర్థిక సహాయం మంజూరు చేసింది. ఈ కమిటీ సమావేశంలో ఎంపికైన 17 మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం, అలాగే ఆయా కుటుంబాలకు ప్రతి నెల మూడు వేల రూపాయల చొప్పున పెన్షన్ ఐదు సంవత్సరాల పాటు అందజేస్తామని ఆయన తెలిపారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలలో ఎల్.కే.జి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి నెలకు ఒక వెయ్యి రూపాయల చొప్పున ట్యూషన్ ఫీజును మంజూరు చేస్తున్నట్లు ఆయన వివరించారు. నలుగురు అనారోగ్యం బారిన పడిన వర్కింగ్ జర్నలిస్టులకు జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కమిటీ సమావేశంలో సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణ చందర్ రావు, మేనేజర్ డి.ఆర్.ఎస్. శైలెశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల పై అవగాహన కల్పించిన.పేరలీగల్ వాలంటరీ ఎస్.హాజమ్మ





**ఉట్కూరు, మండలం, మే,21(సమయం న్యూస్) :** ఉట్కూరు మండలం లోని పులిమామిడి గ్రామంలో జిల్లా న్యాయ సేవ అధికార సవస్థ నారాయనపేట వారి అధ్వర్యంలో పేరలీగల్ వాలంటీర్ ఎస్. హజమ్మ సురక్షిత్ బచ్చన్ (సురక్షిత మైన బాల్యం) సురక్షిత్ భవిష్య ( సురక్షితమైన భవిష్యత్).అంశముల పై మహిళలకు బాలల హక్కుల పై బాలా కార్మిక వ్యవస్థ పై బాల్య వివాహాలు పోస్కో చట్టాలపై గురువారం అవగాహన కల్పించడం జరిగింది 18సం లోపు ఆడపిల్లలకు పెళ్లి చేసినట్లు తెలిస్తే పెళ్లి లో పాల్గొన అందరిపై కేసు నమోదు చేయడం జరుగుతుంది కావున పిల్లలను చదివించాలి లైంగిక వేధింపులకు గురికాకుండా చూడాలి సైబర్ మోసాలకు గురికాకుండా ఉండాలని పిల్లలకు ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే 1098 కి ఫోన్ చేసి వివరాలు చెప్పాలని న్యాయ పరమైన సలహాలు సూచనలు కావాలంటె 15100 కి ఫోన్ చేసి వివరాలు చెప్పాలని మహిళలకు అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు అంబేద్కర్ సంఘం నాయకులు సంపత్ కుమార్ వెంకటయ్య నర్సింలు కె. నారాయణ పాల్గొన్నారు

## ఉదయం 10 లోపు పని చేసి వెళ్లండి కలెక్టర్ దీపక్ తివారి

- జాబ్ కార్డు లేని వారికి వెంటనే ఉపాధి కల్పించేటట్లు చర్యలు తీసుకోవాలి
- సంబంధిత సిబ్బందిని ఆదేశించిన కలెక్టర్





**వికారాబాద్,మే,21(సమయం న్యూస్) :** వికారాబాద్ మండలంలోని పులుమద్ది గ్రామంలో జిల్లా కలెక్టర్,ఎంపీడీఓ అధికారులు పర్యటించారు.అక్కడ ఉపాధి హామీ కార్మికులను కలిసి వారికి జాగ్రత్తలు చెప్పారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉదయం 5:30 నుంచి 10 గంటలలోపు పని చేసుకొని ఇళ్లకు వెళ్లాలని సూచించారు. జాబ్ కార్డు లేని వారికి వెంటనే ఉపాధి కల్పించేట్టు చర్యలు తీసుకోవాలనిసంబంధిత సిబ్బందిని ఆయన ఆదేశించారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సభ విజయవంతం చేయాలి

● జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా




**హైదరాబాద్ మే21( సమయం న్యూస్). :** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా ఈ నెల 22న శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే జిల్లా స్థాయి సభ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి సభ నిర్వహణపై వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రారంభం నుండి జిల్లా స్థాయిలో వివిధ శాఖల నుండి అనేక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని, వాటన్నింటినీ డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శించాలని సూచించారు. ప్రతి శాఖకు సంబంధించిన ప్రగతిపై పది నిమిషాల సమాచారం సిద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలకు ఎంపికైన లబ్ధిదారులు, ప్రతి శాఖలో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, లబ్ధిదారుల ఎంపిక, ఆర్థికపరమైన లబ్ధి, వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు, బడిబాట, జాబ్ మేళా వంటి కార్యక్రమాలను గురించి ఈ సభలో వివరించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ.500 కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, సన్న రకం వరికి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల వివరాలు సభలో వివరించాలని తెలిపారు.సాధించిన విజయాలపై శాఖలు ద్వారా సమాచారం ఇవ్వాలని, లబ్ధిదారుల అభిప్రాయాలు, అనుభవాలు చెప్పడం వంటివి జిల్లా స్థాయి సభలో నిర్వహించాలని అన్నారు. ఇప్పటి దాకా అమలు చేస్తున్న కార్యక్రమాలపై చర్చించాలని, భవిష్యత్లో చేపట్టనున్న పనులపై వివరించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లా స్థాయి సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, సిపిఓ రామ్ దత్తారెడ్డి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి భవనం తుది దశ పనులను పరిశీలించిన కలెక్టర్




**నిజామాబాద్, మే 21( సమయం న్యూస్).** నిజామాబాద్ నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమీపంలో అధునాతన హంగులతో నూతనంగా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవన సముదాయంను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. తుది దశకు చేరుకున్న నిర్మాణ పనులను, వాటి నాణ్యతను పరిశీలించారు. చివరి దశలో ఉన్న పనులను సైతం వేగవంతంగా పూర్తి చేయించాలని, జూన్ 02వ తేదీ లోపు భవన సముదాయాన్ని సంబంధిత శాఖ అధికారులకు అప్పగించాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి భవనం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని సూచించారు. తుది దశ పనులను కూడా నాణ్యతతో పూర్తి చేయించి, సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, ఉత్పత్తుల మార్కెటింగ్కు ఈ భవనం దోహదపడనున్నందున ఎలాంటి సౌకర్యాలకు తావు లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని సదు-పాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓసాయన్న, జిల్లా పంచాయతీరాజ్ అధికారి బావయ్య, ఈ.ఈ వీరానంద్, మెప్మా ఏపీడీ మధుసూదన్ తదితరులు ఉన్నారు.

# అమీర్‌పేట్ హాస్టల్ వివాదం

## బొంతు రామ్మోహన్‌పై నిర్వాహకుల ఆరోపణలు



**హైదరాబాద్, మే 21 (సమయం న్యూస్):** హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని ఓ హాస్టల్ భవనం విషయంలో కాంగ్రెస్ నేత బొంతు రామ్మోహన్ పై హాస్టల్ నిర్వాహకులు తీవ్ర ఆరోపణలు చేశారు. భవనాన్ని అద్దెకు ఇస్తూ రూ.2 కోట్ల అడ్వాన్స్ తీసుకున్న తర్వాత అకస్మాత్తుగా ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు.భవనం ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తూ తమపై దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ నిర్వాహకురాలిపై పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందని, అక్రమ కేసులు బనాయించి భయపెడుతున్నారని ఆరోపించారు.బొంతు రామ్మోహన్ కుటుంబ సభ్యులు, అనుచరులు హాస్టల్ వద్దకు వచ్చి ఉద్రిక్త పరిస్థితులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని హాస్టల్ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# గ్రామాలలో ట్రాన్స్ జెండర్ల రాకపై నిషేధం ఎత్తివేతకు అంగీకారం

- కలెక్టర్ చొరవతో కుదిరిన సయోధ్య
- రాష్ట్రంలోనే తొలిసారిగా సర్పంచ్ లు, ట్రాన్స్ జెండర్లతో సమావేశం



**నిజామాబాద్, మే 21( సమయం న్యూస్)** నిజామాబాద్ జిల్లాలోని ఆయా గ్రామాలలో ఇటీవల ట్రాన్స్ జెండర్ల రాకపై గ్రామ కమిటీలు నిషేధం విధిస్తూ తీసుకున్న నిర్ణయం విషయమై జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి మానవతా దృక్పథంతో స్పందిస్తూ సమస్యకు పరిష్కారం చూపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి ట్రాన్స్ జెండర్లు, గ్రామ సర్పంచ్ లతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. సిరికొండ మండలం మైలారం గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనతో పాటు మరికొన్ని గ్రామాల్లో జరిగిన ఉదంతాలపై ఎంతో సంయమనంతో కలెక్టర్ ఇరు వర్గాల వాదనలు విన్నారు. వివాహాది శుభకార్యాలు, గృహ ప్రవేశాలు, వ్యాపార ప్రారంభోత్సవాలు వంటి సమయాలలో ట్రాన్స్ జెండర్లు గ్రామాల్లోకి వచ్చి బలవంతంగా పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు ఇచ్చేందుకు నిరాకరిస్తే అనుచిత ప్రవర్తనతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయా గ్రామాల సర్పంచ్ లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ట్రాన్స్ జెండర్ల వేషధారణలో కొంతమంది నకిలీలు సైతం వస్తున్నారని, వారి వల్ల మరింతగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. అందువల్లే గ్రామస్తుల ఏకాభిప్రాయం మేరకు ట్రాన్స్ జెండర్ల రాకపై నిషేధం విధిస్తూ తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. అయితే ఈ బహిష్కరణ నిర్ణయాల వల్ల తాము గ్రామాలకు వెళ్లలేకపోతున్నామని, తమ గౌరవానికి భంగం కలుగుతోందని, జీవనోపాధి కోల్పోయామని ట్రాన్స్ జెండర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమ వేషధారణలో కొంతమంది నకిలీలు వ్యవహరిస్తున్న అసంబద్ధ వైఖరి కారణంగా తమపై ఆంక్షలు విధించడం భావ్యం కాదని ఆవేదన వెలిబుచ్చారు. ఇరువర్గాల వాదనలు విన్న మీదట కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన రీతిలో సయోధ్య కుదిర్చారు. నకిలీల బెడదను నివారించేందుకు అర్హత కలిగిన వాస్తవంగా ట్రాన్స్ జెండర్లు అయిన వారికి సమగ్ర నిర్ధారణ చేసి జిల్లా సంక్షేమ శాఖ ద్వారా గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామని అన్నా రు. ఈ ఐ.డీల ద్వారా నకిలీలను సులభంగా గుర్తిస్తూ, వారి బెడదను నివారించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. అయి-తే ట్రాన్స్ జెండర్లు గ్రామాలకు వెళ్లినప్పుడు బలవంతపు వసూళ్లతో ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని, ఇష్టపూర్వకంగా ఇచ్చినది తీసుకోవాలని ట్రాన్స్ జెండర్లకు హితవు పలికారు. సమాజంలో అనేక మంది ట్రాన్స్ జెండర్లను శివాసత్తులుగా కొలుస్తూ, తమకు తోచిన మేరకు డబ్బులు ఇస్తుంటారని, ఆ గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీపై ఉందని హితవు పలికారు. ఇకపై ఎక్కడ కూడా బలవంతంగా డబ్బులు డిమాండ్ చేయవద్దని సూచించారు. ఇందుకు ట్రాన్స్ జెండర్లు అంగీకరిస్తూ, ఇకపై తమ ప్రవర్తనను పూర్తిగా మార్చుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామాలలో వారి రాకపై నిషేధం విధిస్తూ ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించి, ఆంక్షలను ఎత్తివేసేందుకు గ్రామ సర్పంచ్ లు అంగీకారం ప్రకటించారు. ఎంతో సున్నితమైన సమస్యను కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక చొరవ చూపి తనదైన శైలిలో పరిష్కరించడం పట్ల ట్రాన్స్ జెండర్లు, సర్పంచ్లు జిల్లా పాలనాధికారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్, డీ.డబ్ల్యూ.ఓ పద్మ, ఏ.ఓ రాజబాబు, డీఎల్పీఓలు, ట్రాన్స్ జెండర్లు, ఆయా గ్రామాల సర్పంచ్ లు పాల్గొన్నారు.

# సంక్షేమంతో పాటు అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రూ.4.02 కోట్లతో 3.6 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన
- తెల్దారుపల్లిలో ఇప్పటికే 9 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు అమలు
- ఎదులాపురం మునిసిపల్ ప్రాంతం తెల్లారుపల్లిలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి



**ఎదులాపురం, మే-21( సమయం న్యూస్). :** ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.ఏదులాపురం మున్సిపాలిటీ 14వ వార్డు పరిధిలోని తెల్దారుపల్లి నుంచి ఖమ్మం- కోదాడ రోడ్డు వరకు వయా రాముడు చెరువు మార్గంలో 4 కోట్ల 2 లక్షల వ్యయంతో చేపట్టనున్న 3.6 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా లిమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూలిరాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు సాగుతోందన్నారు. తెల్దారుపల్లి ప్రాంతంలో ఇప్పటివరకు సుమారు 9 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు.4 కోట్ల 2 లక్షల వ్యయంతో 3.6 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు నేడు శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గురుకులాల్లో డైట్ ఛార్జీలను 40 శాతం పెంచడంతో పాటు కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు తెలిపారు. యువతకు 72 వేల ఉద్యోగాలు కల్పించామని, రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేశామని మంత్రి పేర్కొన్నారు. సన్న ధాన్యానికి 500 రూపాయలు బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర కేబినెట్ సమావేశంలో కొత్త ఆసరా పెన్షన్లపై నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులకు ఇంటి స్థలం అప్పగింత పట్టా ధృవీకరణ పత్రాలను మంత్రి, జిల్లా కలెక్టర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఈ పంచాయతీ రాజ్ వెంకట్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నగదు చెల్లింపులు సకాలంలో పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల మే 21,( సమయం న్యూస్). :** రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తున్న ధాన్యానికి సంబంధించి ఆయా రైతుల ఖాతాలలో నగదు చెల్లింపులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయాన్ని కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి సందర్శించి రైతులకు చేస్తున్న నగదు చెల్లింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని, ఈ క్రమంలో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలను నగదు చెల్లింపులు సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల వివరాలు రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయడంతో పాటు ట్యాబ్ లలో నమోదు చేయాలని, ఆ దిశగా పౌరసరఫరాల శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**సిద్ధిపేట మే21( సమయం న్యూస్). :** సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో గురువారం ఇందిరమ్మ ఇళ్లు, ఏంజీఎన్ఆర్ఈజీఎస్, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, నూతన ఘన వ్యర్థాల నిర్వహణ-2026 అంశాలపై జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఎంపీడీఓలు, ఎంపీఓలు, గృహ నిర్మాణ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా సామూహిక ఇందిరమ్మ గృహ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో స్లాబ్ స్థాయిలో ఉన్న ఇళ్లన్నింటినీ పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతి, మార్కింగ్, బేస్మెంట్, స్లాబ్, గోడల దశలు, చెల్లింపుల వివరాలపై అధికారులతో సమీక్షించారు. మార్కింగ్ చేసి పనులు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చూడాలని, ఈ నెల 30లోపు పెండింగ్ మార్కింగ్ పూర్తిచేయాలని సూచించారు. లేకపోతే డిలీట్ చేయాలని ఆదేశించారు.

ఏంజీఎన్ఆర్ఈజీఎస్ కింద గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ భవనాలు తదితర పనులను వేగవంతం చేయాలని తెలిపారు. జూన్ 15లోపు పనులు పూర్తి చేయాలని, ప్రతి రోజు ఎఫ్టీవో జనరేట్ చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో రోజుకు 53 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచాలని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం 7 గంటలకు గ్రామాల్లో పనులను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. వనమహోత్సవం సందర్భంగా జిల్లాకు 15 లక్షల మొక్కల లక్ష్యం కేటాయించారని, నర్సరీల నిర్వహణతో పాటు ముందస్తుగా స్థలాలు గుర్తించాలని తెలిపారు. రోడ్ల వెంట కాకుండా దీర్ఘకాలం నిలిచే ప్రదేశాల్లో మొక్కలు నాటాలని సూచించారు. చేయూత పెన్షన్ ఫేస్ రికగ్నిషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని, మరణించిన వారి కేసుల్లో తప్పనిసరిగా మరణ ధృవీకరణ పత్రం తీసుకోవాలని ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ సభ తీర్మానాల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో వినియోగించాలని, ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలను పంచాయతీరాజ్ శాఖ మార్గదర్శకాల ప్రకారం అమలు చేయాలని ఎంపీడీఓలకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ రమేష్, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, డీపీఓ రవీందర్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### ● జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, మే 21( సమయం న్యూస్). :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యక్రమాన్ని ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ఇప్పటికే ప్రజా పాలన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు, ప్రభుత్వం కేటాయించిన నిధుల సమాచారం, జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, సాధించిన పురోగతిని ప్రజలకు వివరించేలా ఆయా శాఖల అధికారులు తదితర అంశాలతో సమగ్ర నివేదికలు సిద్ధం చేసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా అధికారులు సమన్వయంతో బాధ్యతలు నిర్వర్తించాలని తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు, జడ్పీ సీఈవో, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, రెవెన్యూ అధికారులు తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా జరిగిన 'హిందూ సమ్మేళనం'

### ● కల్లూరులో మారుమోగిన భక్తి చైతన్యం, ధర్మ రక్షణకు భక్తుల ప్రతిన







**పోతంగల్, మే 21 (సమయం న్యూస్ )** పోతంగల్ మండల కేంద్రంలోని కల్లూరు గ్రామం గురువారం నాడు ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక చైతన్యానికి వేదికై నిలిచింది. గ్రామంలో ఎటు చూసినా కేరింతలు, భక్తి భావనలు వెల్లివిరిశాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన "హిందూ సమ్మేళనం" మహాసభను విజయవంతం చేయడం కోసం గత కొన్ని రోజులుగా కల్లూరు పరిసర ప్రాంతాలైన జల్లాపల్లి, జల్లాపల్లి ఫారం, ఓల్డ్ జల్లాపల్లి, గన్నారం, లింగాపూర్, బస్వాపూర్, భరంగ్, ఎడిగి అనే 8 గ్రామాల్లో నిర్వాహక బృందం రాత్రింబవళ్లు విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రతి ఒక్కరినీ ఆహ్వానించిన నిర్వాహకుల కష్టానికి తగ్గట్లే, గురువారం ఉదయం నుంచే జనసందోహం కల్లూరు వైపు పోటెత్తింది. సుమారు 2000 మందికి పైగా హిందూ బంధువులు, భక్తులు, మహిళలు, యువతీ యువకులు భారీ సంఖ్యలో తరలిరావడంతో సమ్మేళన ప్రాంగణమంతా జై శ్రీరామ్ నినాదాలతో మార-ంమోగిపోయింది. కార్యక్రమం ప్రారంభంలో భాగంగా మొదటగా జ్యోతి ప్రజ్వలన (దీప ప్రజ్వలనం) చేసి, అనంతరం భక్తులందరూ కలిసి ఎంతో భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ పారాయణంతో సభాప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆ తర్వాత ప్రదర్శించిన సాంప్రదాయ భారత నాట్యం అందరినీ ఎంతగానో ఆకర్షించింది. మన సంస్కృతిని ప్రతిబింబిస్తూ కళాకారులు చేసిన అద్భుతమైన నృత్య ప్రదర్శనలు భక్తులను మంత్రముగ్ధులను చేసి, సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వైభవ ఆధ్యాత్మిక మహాసభకు గీత ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీ శ్రీ విశోక కృష్ణ స్వామి వారు ముఖ్య అతిథిగా విచ్చేసి భక్తులకు తమ అమూల్యమైన అనుగ్రహ భాషణాన్ని అందించారు. అలాగే ప్రముఖ వక్త ఆర్మూర్ సతీష్ గారు హాజరై సమాజాన్ని మేల్కొలిపే విధంగా శక్తి వంతమైన ముఖ్య ప్రసంగం చేశారు. అనంతరం ఈ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా శ్రీకరి, యశస్వి, అధితి వేదికను అలంకరించి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ అతిథులు ముగ్గురూ వేదికపై నుండి ఉమ్మడిగా ప్రసంగిస్తూ, ఈ హిందూ సమ్మేళనం కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, ఇది హిందూ సమాజంలో ఒక కొత్త విప్లవానికి, ఐక్యతకు నాంది అని స్పష్టం చేశారు. మన సనాతన హిందూ ధర్మ విశిష్టతను, తరతరాలుగా వస్తున్న మన అద్భుతమైన సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనాన్ని కథల రూపంలో ఎంతో ఆకట్టుకునేలా భక్తులకు వివరించారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రస్తావిస్తూ, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని జరుగుతున్న మతమార్పిడులపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రలోభాలకు లొంగి మాతృధర్మాన్ని వదులుకోవద్దని, మన ధర్మాన్ని మనమే అండగా నిలబడి కాపాడుకోవాలని భక్తులకు హితవు పలికారు. ఇంతటి గొప్ప ఆశయంతో, భవిష్యత్తు తరాలకు ధర్మాన్ని అందించాలనే సంకల్పంతో ఇంత పెద్ద ఎత్తున ప్రజలందరినీ ఒకే తాటిపైకి తెచ్చి నిర్వహించిన ఈ హిందూ సమ్మేళనం ఎంతో అద్భుతంగా, ఆదర్శవంతంగా సాగిందని వారు మనస్ఫూర్తిగా కొనియాడారు. హిందూ సమాజం ఐక్యంగా ఉంటేనే సంస్కృతి నిలబడుతుందని సందేశాన్ని ఇచ్చారు. ఈ అద్భుతమైన ఆధ్యాత్మిక సమ్మేళనంలో గ్రామ పెద్దలు, హిందూ సంఘాల ప్రతినిధులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో యువతీ యువకులు నడుం బిగించి, ధర్మ రక్షణ కోసం కట్టుబడి ఉంటామని ప్రతిన బూనుతూ ఈ భారీ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా జయప్రదం చేశారు.

# రెవెన్యూ సిబ్బందికి సీనియారిటీ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహణ




**కామారెడ్డి మే21( సమయం న్యూస్). :** కామారెడ్డి జిల్లాలో వివిధ కేడర్‌లలో పనిచేస్తున్న రెవెన్యూ సిబ్బందికి ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య--38 ప్రకారం సీనియారిటీ ఆధారంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్ పాల్గొన్నారు.

నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డింగ్ అసిస్టెంట్లకు సంబంధించి స్థానాల కేటాయింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో ఏఓ వరప్రసాద్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి, కామారెడ్డి జిల్లా చే జారీ చేయబడినది.

# జనగణన ప్రక్రియలో భాగమైన ఇండ్ల గణనను పకడ్బందీగా పూర్తి చేయాలి:

### రాష్ట్ర జనాభా గణన డైరెక్టర్ భారతి హోలికేరి.




**నిర్మల్ మే21( సమయం న్యూస్). :** జనగణన ప్రక్రియలో భాగమైన ఇండ్ల గణనను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర జనాభా గణన డైరెక్టర్ భారతి హోలికేరి అధికారులను ఆదేశించారు. జనగణన డైరెక్టర్, హౌస్ లిస్టింగ్ ప్రక్రియ నిర్వహణ గురించి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాల వారిగా హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ ప్రక్రియ ఎక్కడివరకు వచ్చింది అని తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తి చేసిన హౌస్ లిస్టింగ్ ప్రక్రియ వివరాలను సమీక్షించారు. ఎటువంటి తప్పులకు తావు లేకుండా, పూర్తి పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. నిర్దేశించిన ప్రశ్నలు ప్రజలకు అర్థమయ్యేలా అడగాలని అన్నారు. ఉన్నతాధికారులు ఇండ్ల గణన ప్రక్రియపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని తెలిపారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరం నుంచి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో కొనసాగుతున్న ఇండ్ల గణనకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. నిర్ణీత సమయానికి, పారదర్శకంగా ఈ ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేస్తామని వివరించారు. హౌస్ లిస్టింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ వీసీ లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సిపిఓ జీవరత్నం, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయిపై ఉక్కుపాదం.. కోటగిరిలో ఏసీపీ, సీఐ బృందం విస్తృత తనిఖీలు....



**కోటగిరి, మే 21 ( సమయం న్యూస్ ) :-** కోటగిరి మండల కేంద్రంలో ఏసీపీ బోధన్, సీఐ రుద్రూర్ మరియు ఇన్స్పెక్టర్ ఈగిల్ బృందం సంయుక్తంగా గంజాయి నిర్మూలనే లక్ష్యంగా విస్తృత తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో గంజాయి వాడుతున్నారనే అనుమానితులను అదుపులోకి తీసుకుని, వారికి పోలీస్ శైలిలో కౌన్సిలింగ్ నిర్వహించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. అనంతరం కోటగిరి మండల కేంద్రంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని సమస్యాత్మక (హాట్‌స్పాట్) ప్రాంతాలను సందర్శించిన అధికారులు, గంజాయి విక్రయించినా లేదా వినియోగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, యువతతో కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. మండల పరిధిలో గంజాయి రహిత సమాజం కోసం ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు.



# హార్దిక్ పాండ్యకు భారీ షాక్

**కోల్‌కతా, మే 21 :** ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యకు ఐపీఎల్ క్రమశిక్షణ కమిటీ భారీ షాక్ ఇచ్చింది. తాజాగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అతడిపై జరిమానా విధించారు. హార్దిక్ మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా నమోదు చేశారు. మ్యాచ్ సందర్భంగా పది ఓవర్లు పూర్తైన తర్వాత నాలుగో బంతి వేసిన అనంతరం హార్దిక్ తీవ్ర అసహనానికి లోనైనట్లు తెలుస్తోంది. మైదానంలో తిరిగి వెళ్తున్న సమయంలో కోపంతో వికెట్లను కాలితో బలంగా తన్ని కింద పడేశాడు. క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా ఉద్దేశపూర్వకంగా వికెట్లను ధ్వంసం చేసినందుకే ఐపీఎల్ నిర్వాహకులు ఈ చర్యలు తీసుకున్నారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2 ప్రకారం మైదానంలోని క్రీడా సామగ్రిని లేదా వికెట్లను దుర్వినియోగం చేయడం నిషేధితం. ఒక జట్టు కెప్టెన్‌గా మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన హార్దిక్ ఇలా ప్రవర్తించడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇప్పటికే ఈ సీజన్‌లో ఫామ్ లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముంబై ఇండియన్స్ జట్టుకు ఈ ఘటన మరింత ప్రతికూలంగా మారింది. ఐపీఎల్ క్రమశిక్షణ కమిటీ తీసుకున్న ఈ నిర్ణయం ఇతర ఆటగాళ్లకు కూడా హెచ్చరికగా నిలుస్తుందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# కావ్య మారన్ పెళ్లి పుకార్లు వైరల్

**చెన్నై, మే 21:** సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ కావ్య మారన్, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పెళ్లి వార్తలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఏడాది చివర్లో వీరిద్దరూ వివాహం చేసుకోబోతున్నారంటూ తమిళ సినీ వర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. గత కొంతకాలంగా వీరిద్దరి మధ్య ప్రేమ కొనసాగుతోందని, త్వరలోనే ఇరు కుటుంబాల నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. గత ఏడాది జూన్ నుంచి వీరి రిలేషన్‌షిప్‌పై ఎక్స్, రెడ్డిట్ వంటి సామాజిక మాధ్యమాల్లో అనేక కథనాలు వెలువడ్డాయి. విదేశాల్లో కలిసి కనిపించారంటూ కొన్ని ఫొటోలు కూడా వైరల్ అయ్యాయి. అలాగే సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న పలు భారీ చిత్రాలకు అనిరుధ్ సంగీతం అందిస్తుండటంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది. ఇటీవల ఈ వివాహ సంబంధం కోసం సూపర్ స్టార్ రజనీకాంత్ కూడా రంగంలోకి దిగినట్లు తమిళ మీడియాలో ఊహాగానాలు వినిపించాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇటీవల ఓ పబ్లిక్ ఈవెంట్‌లో పెళ్లి గురించి ప్రశ్నించగా అనిరుధ్ చిరునవ్వుతో స్పందిస్తూ ఆ ప్రశ్నను దాటవేశారు. గతంలో కూడా తన పెళ్లిపై వస్తున్న పుకార్లను ఖండిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ప్రస్తుతం అనిరుధ్ భారీ సినిమాలతో బిజీగా ఉన్నారు. మరోవైపు కావ్య మారన్ ఐపీఎల్‌తో పాటు దక్షిణాఫ్రికా టీ20 లీగ్ వ్యవహారాల్లో నిమగ్నమై బిజినెస్ ఉమెన్‌గా బిజీ షెడ్యూల్ కొనసాగిస్తున్నారు.

# సింధు ధరించిన ఆ పరికరం ఏంటి?



**హైదరాబాద్, మే 21 :** క్రీడా రంగంలో సాంకేతికత వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా క్రికెట్‌లో ఇప్పటికే సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుండగా.. ఇప్పుడు ఇతర క్రీడల్లో కూడా ఆధునిక టెక్నాలజీ అడుగుపెడుతోంది. తాజాగా భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ధరించిన ఓ ప్రత్యేక పరికరం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటీవల పలు బ్యాడ్మింటన్ టోర్నీల్లోనూ, బెంగళూరులో జరిగిన ఓ క్రీడా కార్యక్రమంలో విరాట్ కోహ్లీని కలిసిన సమయంలోనూ సింధు తన కణత వద్ద ఓ చిన్న పరికరం ధరించి కనిపించింది. దీంతో అది ఏమిటన్న చర్చ సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. ఆ పరికరం పేరు 'టెంపుల్'. ఇది కృత్రిమ మేధస్సుతో పనిచేసే ఆధునిక చిప్. అథ్లెట్ల మెదడులో రక్తప్రసరణ ఎలా జరుగుతోందో ఈ పరికరం విశ్లేషిస్తుంది. అలాగే ఆటగాళ్ల మానసిక పరిస్థితి, ఒత్తిడి స్థాయి, ఏకాగ్రత వంటి అంశాలపై కీలక సమాచారాన్ని అందిస్తుంది. ఈ డేటా ఆధారంగా కోచ్‌లు ఆటగాళ్ల శిక్షణ విధానాల్లో మార్పులు చేయడానికి, ఒత్తిడి నియంత్రణకు సరైన నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. క్రీడాకారుల ప్రదర్శనను మెరుగుపరచడంలో ఈ పరికరం కీలకంగా మారే అవకాశముందని క్రీడా నిపుణులు భావిస్తున్నారు. ఈ సరికొత్త టెక్నాలజీని ప్రముఖ ఆహార సరఫరా సంస్థ జొమాటో వ్యవస్థాపకుడు దీపిందర్ గోయెల్ అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఇది ప్రయోగాత్మక దశలో ఉండగా.. పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే అథ్లెట్లకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని క్రీడా వర్గాలు చెబుతున్నాయి.

# చెన్నైపై గుజరాత్ గర్జన!

- చెన్నై సూపర్ కింగ్స్ పై 89 పరుగుల తేడాతో ఘన విజయం
- సాయి సుదర్శన్, గిల్, బట్లర్ విధ్వంసకర బ్యాటింగ్
- 140 పరుగులకే కుప్పకూలిన చెన్నై బ్యాటింగ్ లైనప్
- బౌలింగ్ లో సత్తా చాటిన రషీద్, సిరాజ్, రబాడ





**ఐపీఎల్ టోర్నీలో గుజరాత్ టైటాన్స్ సొంత గడ్డపై సింహంలా గర్జించింది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ను చిత్తుగా ఓడించింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ సమష్టిగా సత్తా చాటిన గుజరాత్ 89 పరుగుల భారీ తేడాతో అద్భుత విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. ఈ భారీ విజయంతో గుజరాత్ టైటాన్స్ ప్లే ఆఫ్స్ స్థానాన్ని మరింత పదిలం చేసుకోగా.. ఘోర పరాజయంతో చెన్నై ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.**



**అహ్మదాబాద్:** నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా గురువారం జరిగిన ఈ కీలక మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు ఆది నుంచే చెలరేగి ఆడారు. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి గుజరాత్ ఏకంగా 229 పరుగుల భారీ స్కోరు సాధించింది. గుజరాత్ బ్యాటర్లలో సాయి సుదర్శన్ 53 బంతుల్లో 84 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలవగా, శుభ్‌మన్ గిల్ 37 బంతుల్లో 64 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఆఖర్లో జోస్ బట్లర్ 27 బంతుల్లోనే 57 పరుగులు చేసి అజేయంగా నిలిచి చెన్నై బౌలర్లకు చుక్కలు చూపించాడు. భారీ స్కోరును కట్టడి చేయడంలో చెన్నై బౌలర్లు తీవ్రంగా విఫలమయ్యారు. ముఖేష్ చౌదరి 4 ఓవర్లలో 36 పరుగులిచ్చి ఒక వికెట్, స్పెన్సర్ జాన్సన్ 4 ఓవర్లలో 47 పరుగులిచ్చి ఒక వికెట్, అన్షుల్ కంబోజ్ 4 ఓవర్లలో 56 పరుగులిచ్చి ఒక వికెట్ తీశారు.

### పట్టు నిలుపుకోలేకపోయిన చెన్నై..

230 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్లు గుజరాత్ బౌలర్ల ధాటికి చేతులెత్తేశారు. వరుస వికెట్లు కోల్పోతూ కేవలం 13.4 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలిపోయారు. చెన్నై బ్యాటర్లలో శివమ్ దూబే 17 బంతుల్లో 47 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. మ్యాట్ షార్ట్ 14 బంతుల్లో 24 పరుగులు, అన్షుల్ కంబోజ్ 8 బంతుల్లో 19 పరుగులు చేసి కాస్త ప్రతిఘటించే ప్రయత్నం చేశారు. మిగతా బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. దీంతో చెన్నైకి 89 పరుగుల భారీ ఓటమి తప్పలేదు.

### చెలరేగిన గుజరాత్ బౌలర్లు..

భారీ లక్ష్య ఛేదనలో ఉన్న చెన్నైని గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్ తో దెబ్బకొట్టారు. చెన్నై బ్యాటింగ్ లైనప్ ను పేకమేడలా కూల్చారు. రషీద్ ఖాన్ కేవలం 2 ఓవర్లలో 18 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. మహ్మద్ సిరాజ్ 3 ఓవర్లలో 26 పరుగులిచ్చి 3 వికెట్లు, కగిసో రబాడ 3.4 ఓవర్లలో 32 పరుగులిచ్చి 3 వికెట్లు తీసి చెన్నై పతనాన్ని శాసించారు. ఈ భారీ విజయంతో గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో తన అగ్ర స్థానాన్ని మరింత మెరుగుపరచుకుంది. భారీ తేడాతో గెలవడం వల్ల ఆ జట్టు నెట్ రన్ రేట్ సైతం అమాంతం పెరిగింది. మరోవైపు ఈ ఘోర పరాజయంతో పాయింట్ల పట్టికలో వెనుకబడి ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలు దాదాపు మూసుకుపోయాయి.



# ధోనీ లేకుండానే సీఎస్కే చివరి పోరు

**అహ్మదాబాద్, మే 21:** ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ అంటే ముందుగా గుర్తొచ్చే పేరు మహేంద్రసింగ్ ధోనీ. ఎన్నో ఏళ్లుగా జట్టుకు వెన్నెముకలా నిలిచిన ధోనీ ఐదు టైటిళ్లు అందించి చెన్నై జట్టును అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీల్లో ఒకటిగా నిలిపాడు. అయితే ఈ సీజన్‌లో మాత్రం అభిమానులకు తీవ్ర నిరాశ ఎదురైంది. ఫిట్‌నెస్ సమస్యల కారణంగా ధోనీ ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ సీజన్‌లోనైనా చివరి ఓవర్లలో ధోనీ మెరుపులు చూడాలని అభిమానులు ఆశగా ఎదురుచూశారు. కానీ గాయాల కారణంగా అతడు జట్టుకు దూరంగానే ఉన్నాడు. ఇప్పటికే చెన్నై సూపర్ కింగ్స్ లీగ్ దశలో 13 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. గురువారం గుజరాత్ టైటాన్స్‌తో అహ్మదాబాద్ వేదికగా చివరి లీగ్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో అయినా ధోనీ బరిలోకి దిగుతాడని అభిమానులు భావించినప్పటికీ, అలాంటి అవకాశాలు కనిపించడం లేదు. ఎందుకంటే ధోనీ అహ్మదాబాద్‌కు వెళ్లకుండా రాంచీకి వెళ్లినట్లు సమాచారం. దీంతో గుజరాత్‌తో జరిగే మ్యాచ్‌కు అతడు అందుబాటులో ఉండడం లేదు. ప్రస్తుతం చెన్నై జట్టు 12 పాయింట్లతో పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో కొనసాగుతోంది. గుజరాత్‌పై గెలిస్తే ఖాతాలో 14 పాయింట్లు చేరతాయి. అదే సమయంలో పంజాబ్, కోల్‌కతా, రాజస్థాన్ జట్లు తమ చివరి మ్యాచ్‌ల్లో ఓడిపోతే చెన్నైకి ప్లేఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉండే అవకాశం ఉంది. ఒకవేళ అద్భుతంగా చెన్నై ప్లేఆఫ్స్‌కు చేరితే ధోనీ మళ్లీ జట్టులోకి వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో అభిమానులు మరోసారి ధోనీని మైదానంలో చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# జకోవిచ్‌కు కొత్త కోచ్..

### 25వ గ్రాండ్‌స్లామ్‌పై గురి




**పారిస్, మే 21:** ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభానికి ముందు ప్రపంచ టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. గత ఏడాది నుంచి స్థిరమైన ప్రధాన కోచ్ లేకుండానే టోర్నీల్లో పాల్గొంటున్న జకోవిచ్ ఇప్పుడు తన స్వదేశానికి చెందిన మాజీ టెన్నిస్ ఆటగాడు విక్టర్ ట్రాయ్‌స్కీని హెడ్ కోచ్‌గా నియమించుకున్నాడు. ఈ విషయాన్ని జకోవిచ్ స్వయంగా సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించడంతో టెన్నిస్ ప్రపంచంలో ఇది హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు కోర్టులో కలిసి ఆడిన స్నేహితులు అయిన జకోవిచ్, ట్రాయ్‌స్కీ ఇప్పుడు గురు–శిష్యులుగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. "నా స్నేహితుడు, నా సహచరుడు.. ఇప్పుడు నా కోచ్. విక్టర్ ట్రాయ్‌స్కీకి స్వాగతం" అంటూ జకోవిచ్ చేసిన పోస్టు అభిమానులను ఆకట్టుకుంది. ఇప్పటికే 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచి చరిత్ర సృష్టించిన జకోవిచ్ గత రెండేళ్లుగా 25వ టైటిల్ కోసం ఎదురు చూస్తున్నాడు. మే 22తో 39వ ఏట అడుగుపెట్టనున్న ఈ సెర్బియా స్టార్ ఇంకా తనలోని పోరాట స్ఫూర్తి తగ్గలేదని నిరూపించాలనే పట్టుదలతో ఉన్నాడు. ప్రస్తుతం టెన్నిస్ ప్రపంచాన్ని శాసిస్తున్న యువ ఆటగాళ్లు జన్నిక్ సిన్నర్, కార్లోస్ అల్కరాజ్‌లకు గట్టి పోటీ ఇవ్వాలంటే తన ఆటను మరింత మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని భావించిన జకోవిచ్.. అందుకే అనుభవజ్ఞుడైన ట్రాయ్‌స్కీని కోచ్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. విక్టర్ ట్రాయ్‌స్కీ కూడా సెర్బియాకు చెందిన ప్రముఖ మాజీ టెన్నిస్ ఆటగాడే. జకోవిచ్‌తో కలిసి సెర్బియా జట్టుకు పదేళ్లకుపైగా ఆడిన అనుభవం అతనికి ఉంది. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత కోచింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ట్రాయ్‌స్కీ, కొంతకాలంగా జకోవిచ్ బృందంలో భాగంగానే కొనసాగుతున్నాడు. ముఖ్యంగా ఒలింపిక్స్‌లో జకోవిచ్ విజయానికి వెనుక అతని పాత్ర కూడా ఉందని టెన్నిస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పుడు పూర్తి స్థాయి హెడ్ కోచ్ బాధ్యతలు చేపట్టిన ట్రాయ్‌స్కీ, జకోవిచ్‌కు ఎంతోకాలంగా ఊరిస్తున్న 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. రోలాండ్ గారోస్ వేదికగా జరగనున్న ఫ్రెంచ్ ఓపెన్ నుంచే వీరి గురు–శిష్యుల ప్రయాణం అధికారికంగా మొదలుకానుంది. ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే ఫ్రెంచ్ ఓపెన్‌లో జకోవిచ్ ప్రదర్శనపై ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. వయసు పెరిగినా తన పట్టుదల, అనుభవం, మానసిక ధైర్యంతో మరోసారి చరిత్ర సృష్టించగలడా అనే చర్చ టెన్నిస్ అభిమానుల్లో జోరుగా సాగుతోంది.



# మళ్లీ ఫామ్‌లోకి త్రిష

## హీరోయిన్ల మధ్య కొత్త పోటీ

దక్షిణాది సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్ త్రిష పేరు మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. దాదాపు రెండు దశాబ్దాలుగా తన నటన, అందంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న త్రిష.. మధ్యలో కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్నారు. ఆ సమయంలో ఆమె రాజకీయాల్లోకి వెళ్లబోతున్నారనే ప్రచారం కూడా జోరుగా సాగింది. దీంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. అయితే ఆ వార్తలన్నీ కేవలం పుకార్లేనని, తన దృష్టి పూర్తిగా సినిమాలపైనే ఉందని త్రిష స్పష్టం చేయడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే విడుదలైన 'కరుప్పు' సినిమా త్రిష కెరీర్‌కు మళ్లీ కొత్త ఊపును తీసుకొచ్చింది. తమిళనాడులో ఈ చిత్రం మంచి వసూళ్లు సాధిస్తూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. దీంతో త్రిష కెరీర్ ముగిసిందని భావించిన విమర్శకులు కూడా ఇప్పుడు ఆమె సక్సెస్‌ను ప్రశంసిస్తున్నారు. ఈ విజయం తర్వాత త్రిష మళ్లీ వరుస సినిమాలతో బిజీ అవుతారా.. లేక ఎంపిక చేసిన కథలతో మాత్రమే ముందుకు వెళ్తారా అన్న చర్చ సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. త్రిష ఒకవేళ భవిష్యత్తులో సినిమాలకు విరామం ఇస్తే.. ఆమె స్థానం ఎవరు భర్తీ చేస్తారన్న చర్చ కూడా ఇండస్ట్రీలో మొదలైంది. ప్రస్తుతం కొత్త హీరోయిన్లు ఎంతోమంది వస్తున్నప్పటికీ.. సీనియర్ స్టార్ హీరోయిన్ల స్థాయిలో మార్కెట్‌ను నిలబెట్టుకోవడం అంత సులువు కాదని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో తమన్నా, కాజల్ అగర్వాల్ పేర్లు ముందుగా వినిపిస్తున్నాయి. తమన్నాకు ఇప్పటికీ అవకాశాలు వస్తున్నప్పటికీ.. మహిళా ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఒంటరిగా విజయవంతం చేసే స్థాయిలో ఇటీవల ఆమెకు పెద్ద హిట్‌లు రావడం లేదు. మరోవైపు కాజల్ అగర్వాల్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించినప్పటికీ.. ఆశించిన స్థాయిలో మళ్లీ బలమైన మార్కెట్‌ను సొంతం చేసుకోలేకపోయారు. దీంతో త్రిష స్థాయిని పూర్తిగా భర్తీ చేయడం వీరికి అంత సులభం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక త్రిష స్థానం విషయంలో ఎక్కువగా వినిపిస్తున్న మరో పేరు నయనతారది. ఇప్పటికే దక్షిణాదిలో అత్యంత భారీ మార్కెట్ కలిగిన హీరోయిన్లలో నయనతార ముందంజలో ఉన్నారు. ఆమె నటిస్తున్న చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తున్నాయి. దీంతో త్రిష సినిమాలకు దూరమైతే.. ఆ మార్కెట్‌ను పూర్తిగా నయనతార తన ఆధీనంలోకి తెచ్చుకునే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది.అయితే సినీ పరిశ్రమలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయని, ఒక్క విజయంతోనే సమీకరణాలు పూర్తిగా మారిపోతాయని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం 'కరుప్పు' విజయంతో మళ్లీ వార్తల్లో నిలిచిన త్రిష.. ఈ అవకాశాన్ని ఎలా వినియోగించుకుంటారన్నదే ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.




## ఉప్పెనను మించిన ట్విస్ట్ ఉంటుంది

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా బుచ్చిబాబు, రామ్ చరణ్ కార్ డ్రైవ్ చేస్తూ ఇంటర్వ్యూ నిర్వహించారు. 'మీకు ఇష్టమైన ఎపిసోడ్ ఏది?' అని దర్శకుడు అడగ్గా.. 'దిల్లీ ఎపిసోడ్ చాలా బాగుంటుంది. సినిమాలో నాకు ఇష్టమైన పార్ట్ అది. 'పెద్ది' మొత్తంలో ఎక్కువ మలుపులు ఉండేది ఆ ఎపిసోడ్‌లోనే కదా.. ఉప్పెనలో ట్విస్ట్ కంటే 100రెట్లు ఎక్కువ ఉంటుంది ఆ ఎపిసోడ్ అని చెప్పారు



## 'లగ్గం' సినిమా హీరోయిన్ హాట్ షో

దక్షిణాది సినీ పరిశ్రమలో తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న యువ నటి ప్రగ్యా నగ్రా మరోసారి సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ఆమె పంచుకున్న తాజా ఫొటోలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తూ విపరీతంగా వైరల్ అవుతున్నాయి. స్టైలిష్ లుక్స్, ట్రెండీ కాస్ట్యూమ్స్‌తో కనిపించిన ప్రగ్యా నగ్రా ఫొటోలకు అభిమానుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ముఖ్యంగా యువత సోషల్ మీడియాలో ఈ ఫొటోలను విస్తృతంగా పంచుకుంటూ ప్రశంసలు కురిపిస్తోంది. హర్యానాలోని అంబాలాలో కాశ్మీరీ కుటుంబంలో జన్మించిన ప్రగ్యా నగ్రా చిన్నప్పటి నుంచే కళలపై ఆసక్తి పెంచుకున్నారు. ఆమె తండ్రి సైనికాధికారి కావడంతో దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం ఢిల్లీలో ఇంజినీరింగ్ చదివిన ఆమె, తర్వాత మోడలింగ్ రంగంలో అడుగుపెట్టి తన కెరీర్‌ను ప్రారంభించారు. వందకు పైగా వాణిజ్య ప్రకటనల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రగ్యా నగ్రా, తన అందం మరియు కెమెరా ముందు ఉన్న ఆత్మవిశ్వాసంతో సినీ అవకాశాలను అందుకున్నారు. రెండువేల ఇరవై రెండులో విడుదలైన తమిళ చిత్రం 'వరలారు ముఖ్యమ్' ద్వారా హీరోయిన్‌గా సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె, తొలి సినిమాతోనే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. అనంతరం మలయాళంలో సుందరి యమునా' చిత్రంలో నటించి ప్రశంసలు అందుకున్నారు. తెలుగు ప్రేక్షకులకు 'లగ్గం' సినిమా ద్వారా పరిచయమైన ప్రగ్యా నగ్రా, తన సహజ నటనతో మంచి గుర్తింపును సంపాదించారు. ఇటీవల ఆమె సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న ఫొటోల్లో ఆధునిక దుస్తుల్లో గ్లామరస్‌గా కనిపించారు. ఫ్యాషన్, స్టైల్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించే ప్రగ్యా నగ్రా ప్రతి ఫొటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. ఆమె ఫొటోలకు వేల సంఖ్యలో లైక్స్, కామెంట్లు వస్తుండగా, పలువురు సినీ అభిమానులు "గ్లామర్ క్వీన్", "స్టైలిష్ స్టార్" అంటూ కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రగ్యా నగ్రా చేతిలో పలు దక్షిణాది చిత్రాలు ఉన్నట్లు సమాచారం. వరుస ఫొటోషూట్లు, కొత్త ప్రాజెక్టులతో ఆమె సినీ రంగంలో మరింత బిజీగా మారుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

## చిరుకు కూతురిగా అనస్వర

చిత్రపరిశ్రమలో ఎప్పుడు ఎవరిని అదృష్టం వరిస్తుందో చెప్పడం చాలా కష్టం. కొంతమందికివరుస విజయాలు అందుకున్నా కొన్నిసార్లు ఛాన్స్‌లు రావు. మరికొంతమందికి ఒక్క సినిమా చేసినా మెగా ఛాన్స్ వచ్చేస్తోంది. తాజాగా మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ రెండో కేటగిరిలో ఉందని చెప్పొచ్చు. చిన్న చిన్న పాత్రలు చేస్తూ కెరీర్‌ను ప్రారంభించిన ఈ బ్యూటీ ప్రస్తుతం స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతోంది. ఛాంపియన్ సినిమాతో అనస్వర తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది. రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి మిక్స్డ్ టాక్‌ను అందుకుంది. సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా అనస్వర న్యాచురల్ యాక్టింగ్‌కి తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అమ్మడికి టాలీవుడ్‌లో మంచి భవిష్యత్ ఉంటుందని జోస్యం కూడా చెప్పారు. ఇప్పుడు ఆ జోస్యం నిజమైంది. ఈ చిన్నది తన రెండో సినిమానే మెగాస్టార్ చిరంజీవితో చేస్తోంది. మెగాస్టార్ చిరంజీవి- బాబీ కొల్లి కాంబోలో వస్తోన్న చిత్రం మెగా 158. ఇక ఈ చిత్రంలో అనస్వర ఒక కీలక పాత్రలో నటించబోతోంది. చిరుకు కూతురిగా ఆమె నటిస్తోందని తెలుస్తోంది. ఎన్నోఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న హీరోయిన్లకు రాని మెగా ఛాన్స్ రెండో సినిమాకే ఈ మలయాళ బ్యూటీకి దక్కడం నిజంగా ఆమె అదృష్టమని నెటిజన్స్ అంటున్నారు.



# చిరంజీవి 158వ చిత్రం

## క్లాప్ కొట్టిన తమ్ముడు పవన్‌కల్యాణ్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా 158వ చిత్రం గురువారం మొదలైంది. కె.ఎస్.రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై కె. నారాయణ నిర్మిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ క్లాప్ కొట్టారు. చిరంజీవి కుమార్తె సుస్మిత కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు వి.వి.వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. అయితే ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆసక్తికర విషయాలు చోటు చేసుకున్నాయి. అన్నపూర్ణ స్టూడియోకు చిరంజీవి, తన సోదరుడు పవన్‌కల్యాణ్ ఒకే కారులో వచ్చారు. తదుపరి నాగబాబు జాయిన్ అయ్యారు. ముగ్గురు కలిసి ఒకే సోఫాలో కూర్చుని చక్కగా ముచ్చటించుకున్నారు. చిరంజీవి పక్కన ఉన్నంత సేపు పవన్ ఎంతో వినయంగా ఉన్నారు. ఈ దృశ్యాన్ని చూసి అభిమానులు సంబరపడిపోయారు. చాలాకాలం తర్వాత ముగ్గురు సోదరులను ఒకే వేదికపై చూడటం కనుల విందుగా ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలాగే చిరంజీవి, పవన్ కల్యాణ్, రామ్‌చరణ్ ఫొటోలను చిత్రించిన పట్టు శాలువాతో చిరంజీవిని సన్మానించింది చిత్ర బృందం. మరో ఆసక్తికర విషయం ఏంటంటే.. పవన్‌కల్యాణ్‌కి భక్తుడైన బండ్ల గణేశ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బండ్లను చూడగానే పవన్ దగ్గరకు తీసుకుని భుజంపై చేయి వేసి మాట్లాడుతూ లోపలికి తీసుకెళ్లారు. ఆ కాసేపు బండ్ల మొహం హై వోల్టేజ్ బల్బ్‌లా వెలిగిపోయింది. ఎప్పటిలాగే వినయంగా చేతులు కట్టుకుని మాట్లాడారు బండ్ల గణేశ్. చిరంజీవి సైతం బండ్లను హత్తుకున్నారు. అభిమానులు మాత్రం 'బండ్లన్నకు ఇవాళ పండగే.. ఆయన అభిమానించే హీరోలతో సరదాగా కాసేపు ముచ్చటించారు. ఈ రోజు ఆయనకు నిద్ర పట్టదేమో' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి అనశ్వర రాజన్ కూడా హాజరయ్యారు. ఈ చిత్రంలో ఆమె చిరుకు కుమార్తెగా కనిపించనున్నట్లు టాక్ నడుస్తోంది.



Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 7036644111, 9490140565

# చంద్రబాబు సీఎంగా ఉండడం ఏపీ దురదృష్టం

- మావిగన్ పేరు చెబితే మూకుమ్మడి దాడులా
- ఇప్పటికే అమరావతికి రూ.47,387 కోట్లు అప్పు
- స్కామ్‌ల కోసం రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్న బాబు
- పెట్రో, డీజిల్ కొరతతోనూ ప్రజలకు చంద్రబాబు మోసం
- మీడియా సమావేశంలో మండిపడ్డ వైఎస్ జగన్



**అమరావతి, మే 21:** చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ చేసుకున్న దురదృష్టమని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. ఏపీకి రాజధాని లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. మావిగన్ అంటే బాబుకు గుండె ఆగిపోయేలా ఉంది. చంద్రబాబు నిర్ణయాలతో భవిష్యత్‌లో కూడా రాజధాని లేకుండా చేస్తున్నారని వైఎస్ జగన్ మండిపడ్డారు. వైఎస్సార్‌ఓపీ అధినేత వైఎస్ జగన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ..'చంద్రబాబు కారణంగా ఏపీ ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇచ్చిన హామీలకు వెన్నుపోటు పొడిచారు. అమరావతిలో రోడ్లు, నీరు, డ్రైనేజీ, మౌలిక సదుపాయాలకే రూ.2లక్షల కోట్లు ఖర్చు అవుతుంది. ఆచరణ సాధ్యం కాదని తెలిసినా అమరావతిపై ముందుకు వెళ్తున్నారు. స్కామ్‌ల కోసమే చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఇప్పటికే అమరావతికి రూ.47,387 కోట్లు అప్పు చేశారు. ఖజానా నుంచి రూ.9200 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. స్కామ్‌ల కోసం రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్నారు. ప్రశ్నిస్తే చంద్రబాబుకు బీపీ పెరుగుతోంది. రాష్ట్రానికి రాజధాని ఉండాలనే మావిగన్‌ను ప్రతిపాదించాం. రాష్ట్ర పరిస్థితుల దృష్ట్యా మావిగన్‌ను ప్రత్యామ్నాయంగా చూపించాం అన్నారు. అమరావతి అయితే జీరో నుంచి మొదలుపెట్టాలి. చంద్రబాబు స్కామ్‌ల కోసం ఏపీని ఇబ్బంది పెడుతున్నారు. ప్రజలకు కూడా మావిగన్‌కు మద్దతు పలికారు. అది తట్టుకోలేక చంద్రబాబు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. మంత్రులతో కూడా బూతులు మాట్లాడిస్తున్నారు. రూ.1200 కోట్లతో అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ ఉన్నా మళ్లీ అన్నీ కొత్తగా కడతానంటున్నారు. కొత్తగా నిర్మిస్తున్న 5 బిల్డింగ్‌ల నిర్మాణం పేరుతో చంద్రబాబు దోపిడీ చూస్తే ప్రజలు నివ్వెరపోతున్నారు. భవన డిజైన్లకే రూ.401 కోట్లు. ఈ ఐదు బిల్డింగులకు అయ్యే మొత్తం ఖర్చు రూ.10,665 కోట్లు.. అంటే ప్రస్తుతం చదరపు అడుగుకు రూ.20,427?. వాటి ఫర్నీచర్, ఇంటీరియర్ ఇంకా అదనపు ఖర్చులన్నమాట.. అంటే చదరపు అడుగుకు రూ.30 వేలు దాటుతుందన్న మాట. మళ్లీ ఇవే నిర్మాణాలకు కొత్త టెండర్లు పిలిచారు.. కానీ, పాత వాళ్లకే ఇచ్చారు. ÷వ్‌స్టార్ హోటల్స్‌కు కూడా చదరపు అడుగు రూ.4,500 లోపే!. తెలంగాణలో రూ.615 కోట్లతో కేసీఆర్ సచివాలయం కట్టారు. మన సెక్రటేరియట్‌కు మాత్రం ఇంత ఖర్చా? ఎందుకు?. కొత్త అసెంబ్లీ, కొత్త హైకోర్టు అంటూ మళ్లీ భారీగా ఖర్చు చేయబోతున్నారు. ఇదంతా విచ్చలవిడిగా చేస్తున్న దోపిడీనే' అని తెలిపారు. ప్రతిపక్ష పార్టీగా గత రెండేళ్లుగా తాము ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నిస్తున్నామని జగన్ తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్‌తో పాటు మొత్తం 143 హామీల అమలు గురించి ప్రజలు కూడా సమాధానం కోరుతున్నారని అన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోలేదని జగన్ విమర్శించారు. 2014–19 మధ్య కాలంలో కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితులు లేకపోయినా, 2015 ఫిబ్రవరిలో లీటర్‌కు రూ.4 చొప్పున పెట్రోలు, డీజిల్‌పై అదనపు భారం మోపారని గుర్తు చేశారు. అయితే తమ ప్రభుత్వ హయాంలో కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులు ఉన్నప్పటికీ, చంద్రబాబు పెంచిన దానికంటే కేవలం ఒక్క రూపాయి మాత్రమే అదనంగా పెంచామని జగన్ పేర్కొన్నారు. ఆ సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ తీవ్ర విమర్శలు చేశారని అన్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే పెట్రోలు, డీజిల్‌పై ఉన్న పన్నులను తగ్గించి ధరలు తగ్గిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని జగన్ గుర్తు చేశారు. అదే విషయాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపరిచారని అన్నారు. ప్రస్తుతం పెట్రోలు, డీజిల్‌పై ఇప్పటికే రూ.4 వరకు అదనపు భారం పెరిగిందని ఆరోపించిన జగన్, చంద్రబాబు గతంలో చెప్పిన మాటల ప్రకారం ఇప్పుడు లీటర్‌కు కనీసం రూ.8 తగ్గించాలి కదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇటీవల ఏర్పడిన పెట్రోలు, డీజిల్ కొరతపై కూడా జగన్ తీవ్ర విమర్శలు చేశారు. ఏప్రిల్ చివరి వారంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెట్రోలు బంకుల వద్ద బారులు తీరారని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల అవసరాలు తీర్చాల్సిన ముఖ్యమంత్రి, అమరావతి కాంట్రాక్టర్లకు రిటైల్ అవుట్‌లెట్ల నుంచి పెట్రోలు, డీజిల్ ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాయడం దారుణమని జగన్ వ్యాఖ్యానించారు. బల్క్‌లో డీజిల్ కొనుగోలు చేస్తే ధర రూ.150 పైగా ఉంటుందని, కానీ రిటైల్ ధర రూ.101 మాత్రమే ఉండటంతో కొందరికి లాభం చేకూర్చే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించిందని జగన్ తెలిపారు. రిటైల్ అవుట్‌లెట్ల నుంచి కమర్షియల్ అవసరాలకు ఇంధనం వాడకూడదని కేంద్రం స్పష్టం చేస్తూ రాష్ట్రానికి లేఖ రాసిందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై స్పందించకుండా సంక్షోభ సమయంలో కూడా స్కామ్‌లకు పాల్పడుతున్నారని ప్రభుత్వం పై జగన్ విమర్శలు గుప్పించారు.

# పుష్కరాలు, అభివృద్ధిపై వినతి

- ముఖ్యమంత్రిని కలిసిన పురంధేశ్వరి
- గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై చర్చ
- రాజమండ్రి అభివృద్ధి పనుల ప్రస్తావన



**రాజమండ్రి, మే 21:** రాబోయే గోదావరి పుష్కరాలు రెండువేల ఇరవై ఏడు ఏర్పాట్లతో పాటు రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలిసి వినతిపత్రం అందజేశారు. పుష్కరాల దృష్ట్యా చేపట్టాల్సిన పనులపై ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిపారు. గోదావరి పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో మౌలిక సదుపాయాల పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని పురంధేశ్వరి వివరించారు. రహదారులు, పారిశుధ్యం, తాగునీరు, భద్రత, రవాణా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరినట్లు సమాచారం. అదేవిధంగా రాజమండ్రి పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వివిధ ప్రాంతాల్లో చేపట్టాల్సిన కొత్త పనులతో పాటు ఇప్పటికే కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను సమర్పించినట్లు తెలిపారు. ప్రజలకు మేలు చేసే పలు ప్రాజెక్టులపై కూడా ముఖ్యమంత్రితో చర్చించినట్లు సమాచారం. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా అవసరాలకు అనుగుణంగా పనులు వేగవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు పురంధేశ్వరి తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై మరిన్ని చర్యలు చేపట్టే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రాజమండ్రి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.

# నక్కపల్లిలో సైనింగ్ స్టార్స్ అభినందన

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత

## హోం మంత్రి అనిత హాజరు




**నక్కపల్లి, మే 21 :** అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో హోంమంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో సైనింగ్ స్టార్స్ అభినందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 103 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున సొంత నిధుల నుంచి నగదు బహుమతులు అందజేశారు. నగదు బహుమతితో పాటు సాలువా, మెమొంటో, ప్రశంసాపత్రాలను అందించి సత్కరించారు. అనకాపల్లి జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులను కూడా ఘనంగా సన్మానించి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని మంత్రి అందజేశారు. విద్యార్థులకు మంచి ఫలితాలు తీసుకురావడంలో కృషి చేసిన ఉపాధ్యాయులను కూడా మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ కలిసి సత్కరించారు. గత సంవత్సరం కూడా పాయకరావుపేట నియోజకవర్గంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సొంత నిధులతో ప్రోత్సాహకాలు అందించి సన్మానించినట్లు ఉపాధ్యాయులు గుర్తు చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో ఏపీ విద్యా వ్యవస్థ అంతర్జాతీయ ప్రమాణాల దిశగా ముందుకు సాగుతోందన్నారు. వంద రోజుల ప్రణాళికలతో ఈసారి పదో తరగతి ఫలితాలు గతంలో ఎన్నడూ లేనంతగా వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలను పత్రికల్లో ప్రకటనల రూపంలో ప్రచురించడం కూటమి ప్రభుత్వ ప్రత్యేకత అని చెప్పారు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు నాసిరకం బ్యాగులు ఇచ్చారని విమర్శించారు. ఈసారి పదో తరగతి ఫలితాల్లో బాలికలే అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని, ఆడపిల్లలు బంగారు తల్లులని కొనియాడారు. పిల్లల పెంపకంలో ఆడ, మగ తేడా చూపకూడదని, వారి ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. చిన్న చిన్న తప్పిదాల వల్ల కొందరు విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని, ప్రతి విద్యార్థికి ఒక స్పష్టమైన లక్ష్యం అవసరమని తెలిపారు. యువత కూడా రాజకీయాల్లోకి రావాలని హోంమంత్రి పిలుపునిచ్చారు.



# బీసీ గురుకుల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్లు

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అమరావతి, మే 21:** విద్యతో పాటు క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరమని, దీన్ని దృష్టిలో పెట్టుకునే బీసీ గురుకులాలు విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్, షూస్ అందజేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసం కలిగించడంతో పాటు వాటిలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ముగ్గురు క్రీడాకారులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి సవిత అభినందించారు. గత నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ లో ఇండియన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గుంటూరుకు చెందిన టి.నాగజ్యోతి 76 కేజీల విభాగంగా జూనియర్ స్థాయిలో పోటీ పడింది. బాలిక 355 కేజీలు ఎత్తి, జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం గెలిచుకుంది. అదే జూనియర్ స్థాయి విభాగంలో పోటీపడిన కె.సత్యరామ్ రాజ్ 53 కేజీల విభాగంలో 110 కేజీలు ఎత్తి జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం గెలుచుకున్నాడు. సబ్ జూనియర్ స్థాయి విభాగంగా పోటీపడిన వినోద్ కుమార్ 110 కేజీలు ఎత్తి, జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం సాధించాడు. ఈ ముగ్గురు క్రీడాకారులతో పాటు వారికి కోచింగ్ అందజేసిన ఎండీ కమ్రుద్దీన్ ను మంత్రి సవిత అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులతో విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ గురుకులాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్ లతో పాటు షూస్ కూడా అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. అంతకుముందు మంత్రి సవిత బంగారు పతకాలు సాధించిన ముగ్గురు క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

# నిత్యానందరెడ్డి పోలీసు కస్టడీ ముగింపు

## హత్య కేసులో రెండు రోజుల విచారణ

## భూ లావాదేవీల కోణంలో ప్రశ్నలు: మళ్లీ జైలుకు తరలింపు

**కడప, మే 21:** వైసీపీ నాయకుడు, కడప మాజీ ఉప మేయర్ నిత్యానందరెడ్డి రెండు రోజుల పోలీసు కస్టడీ ముగిసింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి పెద్ద దస్తగిరి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఆయనను కోర్టు అనుమతితో చిన్నచౌక్ పోలీసులు రెండు రోజుల పాటు తమ కస్టడీలోకి తీసుకుని విచారణ నిర్వహించారు. ప్రస్తుతం ఆయన రిమాండ్ ఖైదీగా కడప కేంద్ర కారాగారంలో ఉన్నారు. ఈ కేసులో ఇప్పటికే పట్టుబడిన ఇతర నిందితులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా నిత్యానందరెడ్డిని పోలీసులు ప్రశ్నించినట్లు సమాచారం. ముఖ్యంగా హత్య అనంతరం నిందితులు తప్పించుకునేందుకు సహకారం అందించారనే అనుమానాలపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలిసింది. ఈ కోణంలో పలు కీలక వివరాలు సేకరించినట్లు సమాచారం. ప్రాథమిక విచారణలో మృతుడు పెద్ద దస్తగిరి, నిత్యానందరెడ్డి మధ్య గత కొంతకాలంగా భూ లావాదేవీలకు సంబంధించిన వివాదాలు ఉన్నట్లు సమాచారం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారానికి సంబంధించిన పలు అంశాలపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ హత్య కేసులో ఇప్పటికే అరెస్టైన నిందితులతో పాటు మరికొందరి పాత్రపై కూడా పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ ఘటన వెనుక మరిన్ని వ్యక్తుల ప్రమేయం ఉండవచ్చనే అనుమానాలతో విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. రెండు రోజుల పోలీసు కస్టడీ ముగిసిన అనంతరం నిత్యానందరెడ్డిని మొబైల్ కోర్టు న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. విచారణ వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి తదుపరి ఆదేశాలు జారీ చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన భద్రత మధ్య నిత్యానందరెడ్డిని తిరిగి కడప కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ కేసులో పోలీసులు మరిన్ని ఆధారాల సేకరణతో పాటు విచారణను కొనసాగిస్తున్నట్లు సమాచారం.

# విజయ్ కేబినేట్‌లో కొత్తగా 23మందికి చోటు

**చెన్నై, మే 21:** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే పార్టీ అధినేత విజయ్ తన కేబినెట్‌ను విస్తరించారు. కొత్తగా 23 మంది ఎమ్మెల్యేలు నేడు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. 21 మంది టీవీకే ఎమ్మెల్యేలతో పాటు మిత్రపక్షం కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటుదక్కింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, తనకు మద్దతిచ్చిన కాంగ్రెస్‌తో పాటు ఐయూఎమ్–ఎల్, వీసీకే పార్టీలకు కూడా సీఎం విజయ్ కేబినెట్ బెర్తు ఆఫర్ చేశారు. అయితే, మరికొంతకాలం తరువాత ఐయూఎమ్ఎల్, వీసీకేలు కేబినెట్‌లో చేరే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సీపీఐ, సీపీఎంలను కూడా సీఎం విజయ్ మంత్రివర్గంలోకి ఆహ్వానించినట్టు మంత్రి ఆధవ్ అర్జున తెలిపారు. వీసీకే చీఫ్ తోల్ తిరుమావళన్ మంత్రివర్గంలో చేరాలని తాము ఆశిస్తున్నట్టు కూడా పేర్కొన్నారు. మే 10న జరిగిన ప్రమాణస్వీకారంలో విజయ్‌తో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణ–స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఇక తమిళనాడు కేబినెట్‌లో గరిష్ఠంగా 35 మంది మంత్రులకు అవకాశం ఉంది. తాజాగా 23 ఎమ్మెల్యేలు మంత్రులుగా చేరడంతో మంత్రి వర్గం సంఖ్య 32కు చేరింది. దీంతో, మరో ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటుదక్కే ఛాన్స్ ఉంది.





# బంగారం మళ్లీ పరుగులు.. వెండి ధర భారీ జంప్

**హైదరాబాద్, మే 21 :** దేశంలో బంగారం ధరలు మరోసారి పెరుగుదల దిశగా సాగుతున్నాయి. గత కొన్ని రోజులుగా ఎగబాకుతున్న పసిడి ధరలు నేడు కూడా అదే ధోరణిని కొనసాగించాయి. ముఖ్యంగా వెండి ధర ఒక్కరోజులోనే భారీగా పెరగడం మార్కెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వివాహాలు, శుభకార్యాల సీజన్ కొనసాగుతుండటంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా పసిడి ధరలు బలంగా ఉండటం దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపుతోంది. నేడు ఉదయం మార్కెట్ ప్రారంభ సమయానికి హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.490 పెరిగి రూ.1,59,930కు చేరుకుంది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.450 పెరిగి రూ.1,46,600 వద్ద కొనసాగుతోంది. వెండి ధరల్లో మరింత భారీ మార్పు కనిపించింది. కిలో వెండి ధర ఏకంగా రూ.5 వేల మేర పెరిగి ప్రస్తుతం రూ.2.9 లక్షల వద్ద ట్రేడవుతోంది. ఇతర ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు ఇదే స్థాయిలో పెరిగాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,61,670కు చేరుకోగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,48,100గా నమోదైంది. ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,59,930గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,46,600 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,60,230కు చేరగా, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ.1,46,750గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా పసిడి ధరలు బలంగానే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 24 క్యారెట్ల ఔన్స్ బంగారం ధర 4,532 డాలర్ల వద్ద కదలాడుతోంది. వెండి ఔన్స్ ధర 75 డాలర్ల వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గుచూపడం, డాలర్ మారకం విలువల్లో మార్పులు, భౌగోళిక ఉద్రిక్తతలు వంటి అంశాలు బంగారం ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇక దేశీయంగా చూస్తే, పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కారణంగా నగల కొనుగోళ్లు పెరగడం కూడా ధరల పెరుగుదలకు మరో ప్రధాన కారణంగా మారింది. రాబోయే రోజుల్లో కూడా బంగారం ధరల్లో ఒడిదుడుకులు కొనసాగవచ్చని బులియన్ మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# అగ్రస్థానంలో అంబానీ

## భారత కుబేరుల జాబితాలో కొత్త రికార్డులు..

**న్యూఢిల్లీ, మే 21 :** అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పటికీ భారతీయ కుబేరులు మాత్రం సంపద సృష్టిలో కొత్త రికార్డులు నెలకొల్పుతున్నారు. ప్రముఖ అంతర్జాతీయ వ్యాపార పత్రిక ఫోర్బ్స్ విడుదల చేసిన ప్రపంచ కుబేరుల జాబితా–2026లో భారత్ నుంచి రికార్డు స్థాయిలో 229 మంది చోటు దక్కించుకోవడం విశేషం. వీరి మొత్తం ఆస్తి విలువ తొలిసారిగా లక్ష కోట్ల డాలర్ల మార్కును దాటినట్లు ఫోర్బ్స్ వెల్లడించింది. ఈసారి ఏకంగా 30 మంది కొత్తవారు జాబితాలోకి ప్రవేశించారు. దేశంలోనే కాకుండా ఆసియాలో అత్యంత ధనవంతుడిగా ముకేశ్ అంబానీ తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఆయన మొత్తం ఆస్తి విలువ 99.7 బిలియన్ డాలర్లుగా నమోదైంది. రెండో స్థానంలో గౌతమ్ అదానీ నిలిచారు. ఆయన సంపద 63.8 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. దేశవ్యాప్తంగా కృత్రిమ మేధ ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ రెండు వ్యాపార సామ్రాజ్యాలు కలిపి 210 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించాయి. దీంతో భారత టెక్నాలజీ రంగంలో భారీ మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓపీ జిందాల్ గ్రూప్ అధినేత్రి సావిత్రి జిందాల్ 39.1 బిలియన్ డాలర్ల ఆస్తితో దేశంలోనే అత్యంత ధనవంతురాలైన మహిళగా నిలిచారు. మొత్తం జాబితాలో ఆమెకు మూడో స్థానం దక్కింది. జిందాల్ గ్రూప్ వ్యాపార విస్తరణతో ఆమె సంపద గణనీయంగా పెరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇక కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ 14.4 బిలియన్ డాలర్ల ఆస్తితో టాప్–10 జాబితాలో చోటు సంపాదించారు. భారత విద్యా సాంకేతిక రంగంలో ఈసారి సంచలన మార్పులు కనిపించాయి. ప్రముఖ విద్యా వేదిక 'ఫిజిక్స్ వాలా' వ్యవస్థాపకులు అలఖ్ పాండే, ప్రతీక్ మహేశ్వరి తొలిసారి కుబేరుల జాబితాలో చోటు సంపాదించారు. గత ఏడాది సంస్థ ఐపీఓకు వచ్చిన అద్భుత స్పందనతో వీరి సంపద భారీగా పెరిగింది. ఈసారి జాబితాలో చోటు దక్కించుకున్న అత్యంత పిన్న వయస్కుడైన భారతీయుడిగా అరవింద్ శ్రీనివాస్ నిలిచారు. కేవలం 31 ఏళ్ల వయసులోనే ఆయన కుబేరుడిగా అవతరించారు. ప్రముఖ కృత్రిమ మేధ సెర్చ్ స్టార్టప్ 'పెర్‌ప్లెక్సిటీ' సహ వ్యవస్థాపకుడిగా ఆయన ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. కొన్నేళ్ల తర్వాత పేటీఎమ్ వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ మళ్లీ కుబేరుల జాబితాలోకి తిరిగి వచ్చారు. మరోవైపు ఓలా వ్యవస్థాపకుడు భవీష్ అగర్వాల్ సహా మరో ఏడుగురు ఈసారి కుబేరుల హోదాను కోల్పోయారు. భారత్ టాప్–10 కుబేరుల జాబితాలో ముకేశ్ అంబానీ మొదటి స్థానంలో ఉండగా, గౌతమ్ అదానీ రెండో స్థానంలో నిలిచారు. సావిత్రి జిందాల్ మూడో స్థానంలో ఉండగా, లక్ష్మీ మిట్టల్, శివ్ నాడార్, సైరస్ పూనావాలా, దిలీప్ సంఘ్వీ, కుమార్ మంగళం బిర్లా, రాధాకిషన్ దమానీ, ఉదయ్ కోటక్ తదుపరి స్థానాల్లో నిలిచారు.



# లాభాలతో మొదలై నష్టాల్లో ముగిసిన మార్కెట్

**ముంబై, మే 21:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం తీవ్ర ఊగిసలాట మధ్య చివరకు నష్టాలతో ముగిశాయి. ఉదయం భారీ లాభాలతో ప్రారంభమైన సూచీలు మధ్యాహ్నం తర్వాత అమ్మకాల ఒత్తిడికి లోనై కిందకు జారాయి. ఇంట్రాడే గరిష్ఠ స్థాయితో పోల్చుకుంటే సెన్సెక్స్ దాదాపు 750 పాయింట్లు కోల్పోవడం మార్కెట్‌లో తీవ్ర ఒత్తిడిని ప్రతిబింబించింది. విదేశీ సంస్థాగత మదుపర్లు భారీగా షేర్ల విక్రయాలకు దిగడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు రావడం మార్కెట్‌పై ప్రభావం చూపాయి. గత ట్రేడింగ్ సెషన్ ముగింపు స్థాయి 75,318 పాయింట్లతో పోలిస్తే గురువారం ఉదయం సెన్సెక్స్ దాదాపు 400 పాయింట్ల లాభంతో ప్రారంభమైంది. ప్రారంభ గంటల్లో కొనుగోళ్లు ఊపందుకోవడంతో సూచీ మరింత ఎగబాకింది. అయితే గరిష్ఠ స్థాయిల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో మార్కెట్ దిశ మారింది. మధ్యాహ్నం తర్వాత విక్రయాల ఒత్తిడి మరింత పెరగడంతో సెన్సెక్స్ నష్టాల్లోకి జారిపోయింది. చివరకు 135 పాయింట్లు కోల్పోయి 75,183 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా ఇదే ధోరణిని అనుసరించింది. ప్రారంభంలో లాభాల్లో ట్రేడైన నిఫ్టీ, తర్వాత క్రమంగా బలహీనపడింది. చివరకు 4 పాయింట్ల స్వల్ప నష్టంతో 23,654 వద్ద స్థిరపడింది. మార్కెట్‌లోని పలు రంగాల్లో మిశ్రమ ధోరణి కనిపించింది. షేర్ మార్కెట్‌లో సమ్మన్ క్యాపిటల్, అంబర్ ఎంటర్‌ప్రైజెస్, గ్రాసిమ్, కేన్స్ టెక్నాలజీ, ఏంజెల్ వన్ వంటి కంపెనీల షేర్లు లాభపడ్డాయి.



మరోవైపు జుబిలెంట్ ఫుడ్, పీఐ ఇండస్ట్రీస్, బాష్, ఎంసీఎక్స్ ఇండియా, మ్యాన్‌కైండ్ ఫార్మా వంటి షేర్లు నష్టాలు చవిచూశాయి. బ్యాంకింగ్ రంగంపై కూడా ఒత్తిడి కనిపించింది. బ్యాంక్ నిఫ్టీ సూచీ 122 పాయింట్లు పడిపోయింది. మధ్య తరహా కంపెనీల్లో కూడా అమ్మకాల ప్రభావం కనిపించగా, నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 22 పాయింట్లు నష్టపోయింది. విదేశీ సంస్థాగత మదుపర్లు బుధవారం ఒక్కరోజే రూ.1,597 కోట్ల విలువైన షేర్లను విక్రయించడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, అమెరికా మార్కెట్ల బలహీన సంకేతాలు కూడా దేశీయ సూచీలపై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

ఇక కరెన్సీ మార్కెట్‌లో రూపాయి స్వల్ప బలహీనతను నమోదు చేసింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ప్రస్తుతం 96.19 వద్ద కొనసాగుతోంది.

# మెటాలో ఉద్యోగాల కోత కలకలం

## ఉద్యోగులకు జుకర్‌బర్గ్ భరోసా




**న్యూయార్క్, మే 21 :** ప్రపంచ దిగ్గజ సాంకేతిక సంస్థ మెటాలో భారీ స్థాయిలో ఉద్యోగుల తొలగింపు వార్తలు అంతర్జాతీయ టెక్ రంగంలో తీవ్ర చర్చకు దారి తీశాయి. దాదాపు 8 వేల మంది ఉద్యోగులను తొలగించినట్లు వెలుగులోకి రావడంతో సంస్థలో మిగిలిన సిబ్బందిలో ఆందోళన నెలకొంది. మరోసారి లేఆఫ్స్ ఉంటాయన్న ప్రచారం జోరుగా సాగుతుండటంతో ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మెటా సంస్థ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ ఉద్యోగులకు భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. ఈ ఏడాది సంస్థ వ్యాప్తంగా మరో భారీ స్థాయి ఉద్యోగాల కోత ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగుల తొలగింపు నిర్ణయం తనను కూడా తీవ్రంగా బాధించిందని వెల్లడించారు. కంపెనీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులకు వీడ్కోలు చెప్పడం ఎంతో ఆవేదన కలిగించిందన్నారు. ఈ క్లిష్ట సమయంలో ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందుకు తీసుకెళ్లేందుకు తాను పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు పంపిన అంతర్గత సందేశంలో కృత్రిమ మేధ ప్రపంచాన్ని వేగంగా మార్చేస్తోందని జుకర్‌బర్గ్ పేర్కొన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ రంగంలో పోటీ తీవ్రంగా పెరుగుతోందని, అలాంటి పరిస్థితుల్లో మెటా లాంటి దిగ్గజ సంస్థ కూడా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సంస్థను పునర్వ్యవస్థీకరించే ప్రక్రియలో భాగంగానే ఈ నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు. ప్రస్తుతం మెటాకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల్లో దాదాపు 10 శాతం మంది ఉద్యోగులు ఈసారి ప్రభావితమైనట్లు సమాచారం. మరో 7 వేల మందిని ఇతర విభాగాలకు బదిలీ చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అంతేకాకుండా సంస్థలో ఖాళీగా ఉన్న సుమారు 6 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను కూడా తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఇక కృత్రిమ మేధ రంగంపై మెటా భారీ స్థాయిలో దృష్టి సారిస్తున్న విషయం తెలిసిందే. సంస్థను పూర్తిగా ఏఐ ఆధారిత భవిష్యత్తు వైపు తీసుకెళ్లేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసిన జుకర్‌బర్గ్, ఈ ఏడాది ఏఐ రంగంలోనే 145 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇటీవల ప్రకటించారు. భవిష్యత్తులో సోషల్ మీడియా, వర్చువల్ రియాలిటీ, డిజిటల్ కమ్యూనికేషన్ రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషించనున్న నేపథ్యంలో మెటా తన వ్యూహాలను వేగంగా మార్చుకుంటోందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# స్కోడా 'జీఓఏటీ' ప్రచారం

## ఆసియా రికార్డులతో దూసుకెళ్లిన కార్లు

**ముంబై, మే 21 :** ప్రముఖ కార్ల తయారీ సంస్థ స్కోడా ఆటో ఇండియా తన 125 ఏళ్ల మోటార్ స్పోర్ట్స్ వారసత్వాన్ని మరోసారి ఘనంగా చాటుకుంది. బ్రాండ్‌కు చెందిన శక్తివంతమైన పనితీరు, రేసింగ్ డీఎన్‌ఏను ప్రతిబింబించేలా 'జీఓఏటీ' పేరుతో సరికొత్త గ్లోబల్ ప్రచారాన్ని ప్రారంభించింది. సాధారణంగా "గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్"గా పిలిచే జీఓఏటీ పదాన్ని స్కోడా తనదైన శైలిలో "గ్రేటెస్ట్ ఆస్ఎట్రాక్"గా మార్చి ఈ వినూత్న ప్రచారాన్ని రూపొందించింది. ఈ ప్రచారంలో భాగంగా తమిళనాడులోని కోయంబత్తూరులో ఉన్న కోస్ట్ రేసింగ్ సర్క్యూట్‌లో స్కోడా కార్లు సరికొత్త రికార్డులను సృష్టించాయి. "ఒకే తయారీదారుకు చెందిన అత్యంత వేగవంతమైన మల్టీ కార్ రిలే" విభాగంలో పోటీ పడి, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో పాటు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాయి.

### ఐదు కార్లు.. ఒకే లక్ష్యం.. వేగంలో కొత్త చరిత్ర

ఈ ప్రత్యేక రికార్డు కోసం స్కోడా తన ఫ్లీట్‌లోని ఐదు ప్రముఖ కార్లను ట్రాక్‌పైకి దించింది. కైలాక్, కుషాక్, స్లావియా, కోడియాక్ మరియు ఆక్టేవియా ఆర్ఎస్ కార్లు ఈ రిలే రేసులో పాల్గొన్నాయి. ఐదుగురు ప్రొఫెషనల్ డ్రైవర్లు పిట్ లేన్ మార్పులతో కలిపి మొత్తం 3.8 కిలోమీటర్ల ట్రాక్‌ను కేవలం 12 నిమిషాల 30.97 సెకన్లలో పూర్తి చేసి రికార్డు నెలకొల్పారు.

ఈ పోటీలో ఆక్టేవియా ఆర్ఎస్ అత్యంత వేగంగా 2 నిమిషాల 10.85 సెకన్లలో ట్రాక్ పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. కోడియాక్ 2:26.34, స్లావియా 2:27.63, కుషాక్ 2:29.7 మరియు కైలాక్ 2:31.6 సమయంలో ట్రాక్‌ను పూర్తి చేసి తమ వేగం, హ్యాండ్లింగ్, బ్రేకింగ్ సామర్థ్యాలను నిరూపించాయి.

### 125 ఏళ్ల రేసింగ్ వారసత్వం

స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా మాట్లాడుతూ.. స్కోడా కార్లలో మోటార్ స్పోర్ట్స్ డీఎన్ఏ అనేది కేవలం ప్రచార పదం కాదని, ప్రతి వాహనంలో అంతర్లీనంగా ఉండే ప్రత్యేకత అని తెలిపారు. 1901 నుంచే రేసింగ్ ప్రపంచంలో స్కోడాకు ప్రత్యేక స్థానం ఉందని, అర్ధ శతాబ్దానికి పైగా "ఆర్ఎస్" గుర్తును గర్వంగా కొనసాగిస్తున్నామని చెప్పారు. స్టీరింగ్ కచ్చితత్వం, ఛాసిస్ సమతుల్యత, డ్రైవర్‌కు కలిగే అనుభూతి వంటి అంశాలను కేవలం కాగితాలపై చూసి అర్థం చేసుకోలేమని, స్టీరింగ్ వెనుక కూర్చుని డ్రైవ్ చేసినప్పుడే ఆ అనుభూతి తెలుస్తుందని వివరించారు.

### వేగంతో పాటు భద్రతలోనూ ముందంజ

స్కోడా వాహనాలు గ్లోబల్ క్రాష్ టెస్టుల్లో 5 స్టార్ భద్రతా రేటింగ్ సాధించాయని కంపెనీ తెలిపింది. వేగం మాత్రమే కాకుండా ప్రయాణికుల భద్రతకూ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించింది. ఈ "జీఓఏటీ" ప్రచారం ద్వారా భారత ఆటోమొబైల్ రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు స్కోడా స్పష్టం చేసింది.

